Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 1 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 25 జనవరి 2024 | గురువారం | పేజీలు : 4

## అసోంలో రాహుల్ గాంధీపై కేసు

గువాహటి : కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీపై అసోం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భారత్ జోడో న్యాయ యాత్ర పేరిట రాహుల్ నిర్వహిస్తున్న పాదయాత్రను వారు అడ్డుకున్నారు. రాజధాని గువాహటి నగరంలోకి ఆయన పాదయాత్ర ప్రవేశించకుండా పోలీసులు బారికేడ్లు అడ్డం పెట్టగా.. కాంగ్రెస్ శ్రేణులు వాటిని ఛేదించుకుని నగరంలోని ప్రధాన రహదారిపైకి అడుగుపెట్టాయి. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలంటూ ప్రజలను రెచ్చగొట్టిన రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అసోం సీఎం హిమంత విశ్వశర్మ ఆ రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర పోలీసులు రాహుల్ గాంధీపైన, ఆయనతోపాటు ఉన్న కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, కన్హయ్యకుమార్‌పైన.. హింసకు ప్రేరేపించడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం సహా పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.

# కాళేశ్వరం - మేడిగడ్డలలో 'భారీ అవినీతి'

## ఆ రెండే ప్రచారాస్త్రాలా ?



హైదరాబాద్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రచార అస్త్రాలను రెడీ చేసుకుంటోంది. అస్త్రాలు ఎన్నున్నా కీలకమైన రెండింటిపైన ఎక్కువగా ఫోకస్ పెట్టాలని డిసైడ్ అయ్యిందట పార్టీ.

అదేమిటంటే కాళేశ్వరం, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అవినీతి. ధరణిపోర్టల్లో జరిగిన భూ దోపిడీ. ఈ రెండు అంశాలపైనే కేసీయార్, బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఫోకస్ చేయాలని ఇప్పటికే రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు సమాచారం. రాబోయే ఎన్నికల్లో కేసీయార్ ను నోరెత్తనీయకుండా చేయటంలో భాగంగానే మంత్రులు పదేపదే ఇరిగేషన్ శాఖలో జరిగిన భారీ అవినీతిని ప్రస్తావిస్తున్నారు. కాళేశ్వరం ఫెయిల్యూర్ ప్రాజెక్టని, మేడిగడ్డలో విపరీతమైన అవినీతి జరగటంతో పాటు నాణ్యత బాగా నాసిరకంగా ఉందని రేవంత్ అండ్ కో పదేపదే జనాలకు చెబుతున్నారు. నాసిరకం నాణ్యత కాబట్టే పిల్లర్లు కుంగిన విషయాన్ని రేవంత్ ప్రధానంగా హైలైట్ చేస్తున్నారు. పిల్లర్లు కుంగటాన్ని నాణ్యతా లోపంగా ఇప్పటికే నిపుణులు కూడా తేల్చిచెప్పారు. దాంతో వేరే దారిలేక కేటీయార్ కూడా నిర్మాణంలో చిన్నచిన్న లోపాలుండటమే సహజమే అని అంగీకరించారు. రాబోయే ఎన్నికల్లో కేటీయార్ అంగీకారాన్నే తమకు అనుకూలంగా మలుచుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. కాళేశ్వరం, మేడిగడ్డతో పాటు ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టు అవినీతిని కూడా బాగా హైలైట్ చేయబోతున్నది కాంగ్రెస్. ఇలాంటి అనేక పథకాల్లో అవినీతిని లెక్కబెడుతున్నారు. అలాగే ధరణి పోర్టల్లో జరిగిన అవకతవకలను కూడా చూస్తున్నారు. వేలాది ఎకరాలను అక్రమార్కులకు ధరణి పోర్టల్ ద్వారా కేసీయార్ ప్రభుత్వం కట్టబెట్టిన వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. పోర్టల్ ను అడ్డుపెట్టుకుని లాభపడిన వాళ్ళ వివరాలను గ్రౌండ్ లెవల్లో విచారణ చేయిస్తోంది. ఒకవైపేమో గ్రామాల్లో వేలాదిమంది భూయజమనాలు పోర్టల్ ద్వారా నానా ఇబ్బందులు పడ్డారు.

ఇదే సమయంలో అధికారపార్టీలో పట్టున్న కొందరు వేలాది ఎకరాలను పోర్టల్ ను అడ్డుపెట్టుకుని సొంతం చేసుకున్నారనే విషయం బయటపడింది. కాబట్టి అనేక అంశాలను ప్రస్తావిస్తునే ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అవినీతి, ధరణిపోర్టల్ అవకతవకలపై ఎక్కువగా దృష్టిపెట్టాలని రేవంత్ డిసైడ్ అయ్యారు. కేసీయార్ కు గట్టిగా సమాధానం చెప్పుకునే అవకాశం ఇవ్వకూడదన్నది రేవంత్ ఉద్దేశ్యం. మరి చివరకు ఏమిజరుగుతుందో చూడాలి.

# బాధపడేంత ఓటమి కాదు..! తెలంగాణ అసెంబ్లీ ఫలితాలపై కేటీఆర్ వ్యాఖ్యలు..



కరీంనగర్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. 'మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిలిన దెబ్బ చిన్నదే. 119 నియోజకవర్గాల్లో మనం పోటీ చేస్తే మనల్ని ప్రజలు చీకొట్టలేదు. తీసి అవతలపడేయలేదు. 39 సీట్లు ప్రజలు ఇచ్చారు. మూడోవంతు సీట్లు ఇచ్చారు. 14 నియోజకవర్గాల్లో స్వల్ప తేడాతో ఓడిపోయాం. జుక్కల్‌లో 1152 ఓట్లు, దేవరకద్రలో 1382 ఓట్లు, సిర్పూర్‌లో 3వేల ఓట్లు, బోధన్‌లో 3వేల ఓట్లు, ఖానాపూర్‌లో 4289 ఓట్లు తేడా. కొన్ని ఓట్ల తేడాతోనే కొన్ని సీట్లు కోల్పోయాం. ఈ 14 సీట్లలో ఆరేడు సీట్లు మనం గెలిచినా.. ఇవాళ ఏం ఉంటుండెనో పరిస్థితి మాకే నాకంటే బాగా తెలుసు'నని కేటీఆర్ అన్నారు.

**బాధపడేంత దరిద్రమైన ఓటమి కాదు..** 'మనకు జరిగింది ఊహించలేనటువంటి.. బాధపడేంత దరిద్రమైన ఓటమి కాదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎవరు ఎట్ల గెలిచారో ఆలోచన చేయాలి. పక్కనే ఉంటది ధర్మపురి నియోజకవర్గం. అక్కడ కొప్పుల ఈశ్వర్ ఓడిపోయారు. ఆయన ఎందుకు ఓడిపోయారు ? కరీంనగర్ పార్లమెంట్ సమీక్షా సమావేశంలో జమీల్ ఒక్క మాటన్నడు. అన్న భారతదేశం భావోద్వేగాల మీద ఓటు వేస్తది అన్నడు. మన దేశం కొద్దిగా ఎమోషనల్ దేశం. ఉద్వేగాన్ని, భావాన్ని, బాధను పంచుకుంటరు అన్నాడు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గదే జరిగింది. ధర్మపురిలో ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ ఇంతకు ముందు నాలుగు సార్లు ఓడిపోయారు. ఇంటింటికి తిరుగుతూ రోడ్డున పడుతా అంటూ ఏడ్చారు. చొప్పదండిలో ఏం జరిగింది. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే గతంలో రెండుసార్లు ఓడిపోయారు. ఆయన ఇంటింటికి తిరుగుతూ ఏడ్సుకుంట. ఆస్తులన్నీ అమ్ముకున్న. అవుట్‌పోయిన నాకు దయచేసి ఒక్కసారి ఓటు వేయాలని ఆయన తిరిగిండు. మానకొండూరులో కవ్వంపల్లి సత్యనారాయణ ఓడిపోయిండు. నాకు ఒక్కసారి అవకాశం ఇవ్వండి దండం పెడుత అన్నడు. వేములవాడలో ఇప్పుడున్న ఎమ్మెల్యే నాలుగు సార్లు ఓడిపోయాడు. దయచేసి నాకు అవకాశం ఇవ్వాలి.. ఐదోసారి ఓడిపోతే అడ్రస్ లేకుండాపోతా అని తిరిగిండు. సిరిసిల్లలో నాపై పోటీ చేసిన ఆయనది అదే ప్రయత్నం. 65 ఏళ్లు వచ్చాయ్.. వచ్చేసారి ఉంటనో లేదో.. ఈసారి ఒక్కసారి అవకాశం ఇవ్వండి ఆయన తిరిగిండు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

**సెంటిమెంట్‌తోనే గెలిచారు..** 'ఎక్కడికక్కడ సెంటిమెంట్‌తోనే కాంగ్రెస్ అభ్యర్థులంతా బ్రహ్మాండంగా గెలిచారు తప్ప.. ఇంకోటి కానే కాదు. ఈ మాట ఎందుకు అంటున్నాంటనే.. మన ఎమ్మెల్యేలంతా పని మంతులు కాదని కాదు.. కేవలం సెంటిమెంట్ కారణం. కరీంనగర్ లోక్‌సభ ఒకసారి మొత్తం తీసుకుంటే.. మనం ముందున్నాం. లోక్‌సభ పరిధిలో మొత్తం ఐదారువేల ఓట్లతో మొత్తంగా ముందంజలో ఉన్నాం. ముగ్గురు ఎమ్మెల్యేలు, నలుగురు మాజీలు, ఐదుగురు జడ్పీ చైర్మన్లు ఉన్నారు. కానీ, మొన్న ఏడుపులు, బొబ్బలతో ఓట్లు దెబ్బినోళ్లు ఇవాళ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలు అయ్యారు. వాళ్లకు ఈసారి సానుభూతి ఉండదు.. మన్ను ఉండదు. అక్కడ ఈ సారి ఏం జరుగుతుందంటే.. ప్రజలు ఏమాయే బిడ్డ మీ రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద మాటలు చెప్పిండు.. ఏమాయే అని అడుగుతరు. నేనేం విమర్శ చేస్తలేను.. నేను గుర్తు చేస్తున్నా. ఆ నాడు రేవంత్‌రెడ్డి రైతులు లోన్ తీసుకోనొళ్లు ఉంటే.. అర్జెంటుపోయి రూ. 2లక్షల లోన్ తీసుకోండి డిసెంబర్ 9న వచ్చి నేను కడుతా అన్నడు' కేటీఆర్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వీడియో ప్లే చేయించి చూపించారు. రుణమాఫీ, పింఛన్లు, రైతుబంధు, కరెంటు బిల్లులపై చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియా వారియర్స్‌కు స్క్రీన్‌పై ప్రదర్శించారు.

# సీఎం రేవంత్ సెక్యూరిటీలో లీక్ రాయుళ్లు

## ఐబీ కీలక నిర్ణయం

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సెక్యూరిటీ విషయంలో ఇంటెలిజెన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. లీక్ రాయుళ్లు ఉన్నారనే పక్కా సమాచారంతో ఆయన దగ్గరి పోలీస్ సెక్యూరిటీ సిబ్బంది మొత్తాన్ని మార్చేయాలని నిర్ణయించుకుంది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సంబంధించిన



ప్రతీ సమాచారం లీక్ అవుతోందనే నేపథ్యంలోనే ఐబీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వద్ద భద్రతా అధికారులను మార్చాలని నిర్ణయించింది.

ముందుగా పోలీస్ సెక్యూరిటీని మార్చేసింది. మాజీ సీఎం కేసీఆర్ దగ్గర పని చేసిన ఏ ఒక్క అధికారిని.. సిబ్బందిని కూడా సీఎం రేవంత్ వద్ద పెట్టొద్దని సీఎంవోను ఐబీ ఆదేశించింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక పలు విభాగాల అధిపతుల్ని మార్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలకమైన నిఘా విభాగాధిపతిగా శివధర్‌రెడ్డిని నియమించింది రేవంత్ సర్కార్.

# 'అయోధ్య మోడీని నిలబెట్టిందా?'

## బిజెపికి రాములోరు విజయాన్ని కట్టబెట్టేనా...?





ఒక్క అయోధ్య. ఒక్కడే రాముడు. ఒక్కటే బాణం ఆయనకు. అలాగే ఒక్కటే మాట ఆయనిది. యుగాలకు కాలాలకు అతీతమైన దైవం శ్రీరాముడు. ఆయన చుట్టూ ఒక్క పార్టీనే తిరుగుతూ ఉంది. అదే బీజేపీ. రాముడు అంటే అందరికీ ఇష్టమే. అయోధ్య అంటే పవిత్రమైన ప్రదేశంగా హిందువులు భక్తి ప్రపత్తులతో కొలుస్తారు. రాముడు ఒక నాడు నడయాడిన నేల అన్న గట్టి భావం ప్రతీ హిందువులో ఉంది. రామరాజ్యం రావాలని అంతా కోరుకుంటారు. అలాంటి శ్రీరాముడికి గుడి లేదు. అయిదు వందల ఏళ్ల క్రితం నుంచి ఆ వివాదం ఉంది. దాన్ని అధిగమించి ఎట్టకేలకు 2024 జనవరి 22న రాముల వారి భవ్యమైన ఆలయం అయోధ్యలో ఏర్పాటు అయింది. అక్కడ బాల రాముడి విగ్రహానికి అభిజిత్ లగ్నంలో ప్రాణ ప్రతిష్ట జరిగింది. ఇక మీదట రాముల వారు అయోధ్యలో అద్భుతమైన ఆలయంలో కనిపిస్తారు. ఇది హిందువులు అందరికీ పర్వ దినం. మరి ఇలాంటి సందర్భంలో కనిపించిన ఒకే ఒక పార్టీ బీజేపీ. రామ జపం ఒక వైపు సాగుతూంటే మోడీ కూడా అలాగే కనిపించారు. ఆయన దేశానికి ప్రధాని హోదాలో రాముల వారి ఆలయంలో ప్రాణ ప్రతిష్టలో పాలు పంచుకున్నారు అనుకున్నా మొత్తానికి మొత్తం ఈ కార్యక్రమం బీజేపీ హై జాక్ చేసేసింది అన్న విమర్శలు వస్తున్నాయి. విపక్షాలు సైతం దుమ్మా కొట్టడం బీజేపీకి కలసి వచ్చింది. అయోధ్యలో రాముల వారి ఆలయ ప్రారంభం ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం బీజేపీ సొంత కార్యక్రమంగా చేసిందని అంటున్నారు. ఒక విధంగా ఈ విషయంలో బీజేపీ పూర్తి స్థాయిలో సక్సెస్ అయిందని అంటున్నారు ఎక్కడ చూసిన రాముల వారి గురించి చర్చకు వస్తూంటే దానితో పాటుగా నరేంద్ర మోడీ బీజేపీ గురించి కూడా చర్చ వస్తోంది. ఆ విధంగా జనాల మైండ్ సెట్ ని ట్యూన్ చేయడంలో బీజేపీ పూర్తిగా విజయవంతం అయింది.

తిప్పు చూస్తే మరో రెండు నెలలలో ఎన్నికలు ఉన్నాయి. ఆ ఎన్నికల వేళ ఇంతటి బ్రహ్మాండమైన కార్యక్రమంలో బీజేపీ ఉండడం అంతా తానైన్ నడిపించడం దేశమంతా అయోధ్య పేరు తపిస్తున్న వేళ మరో మూడు అక్షరాలతో బీజేపీ కూడా పక్కన చేరడం వంటివి చూస్తే కనుక బీజేపీ సక్సెస్ అయింది అని ఏవైనా అంటారు. ఈ దెబ్బతో 2024 ఎన్నికల్లో బీజేపీ తనదైన ప్రచారాన్ని ఏకంగా ఎనభై శాతానికి పైగా చేసేసింది అని అంటున్నారు దేశంలోని కోట్లాది జనం మొత్తం టీవీ సెట్లకు అతుక్కుపోయి అంతా చూశారు. మొత్తం భారత్ అంతా రామ జపంతో తరిస్తోంది. అంతా కూడా ఆ పవిత్రమైన అయోధ్యను తలచుకుని తపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ కూడా జనం మనసుల్లో కనిపిస్తోంది. ఒక అద్భుతమైన కార్యక్రమానికి బీజేపీ కూడా కారణం అన్న భావన జనంలోకి వెళ్ళిపోయింది. అయోధ్య వివాదాన్ని సామరస్యంగా న్యాయపరంగా పరిష్కరించడం ద్వారా బీజేపీ అయోధ్య సంస్యకు శాశ్వతమైన పరిష్కారం చూపడమే కాకుండా ఈ రోజున అయోధ్యలో భవ్యమైన ఆలయం నిర్మాణానికి కారణం అయింది అన్నది సగటు హిందువులో బలంగా నాటుకుంది. ఆ విధంగా చేయడంలో బీజేపీ ప్లాన్ సక్సెస్ అయింది. మొత్తం మీద చూసుకుంటే ఏ విధమైన సభలు సమావేశాలు లేకుండా బీజేపీ ఒక్క అయోధ్య అంశంతో జనాలకు తాను రీచ్ అయింది అని అంటున్నారు. ఇక మిగిలిన ఇరవై శాతం ప్రచారం మాత్రమే బీజేపీ చేసుకోవాల్సి ఉంది. అది లాంచనమే అంటున్నారు. సో బీజేపీ ఇపుడు ప్రత్యర్ధులకు అందనంత ముందున ఉంది అన్నది ఒక విశ్లేషణ. ఇది రైటా రాంగా మతాన్ని రాజకీయాలు కలపవచ్చా అన్నది పక్కన పెడితే బీజేపీని అయోధ్య రాముడు మళ్లీ మనసారా ఆశీర్వదిస్తాడు అన్నది కాషాయం పార్టీ గట్టి నమ్మకం. తీర్పు ప్రజలు అనుకూలంగా ఇస్తారు మీరే చూస్తారు అన్నది నిబ్బరం బీజేపీది అవుతోంది.

# సంపాదకీయం

## అంతా మోడీ మయం... నెహ్రూ చేసిందేంటి...!?

అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం లో బీజేపీ హడావుడి ఎక్కువ అయిందని జాతీయ స్థాయిలో విపక్షాలు విమర్శిస్తున్నాయి. మతపరమైన కార్యక్రమాన్ని ప్రధాని హోదాలో మోడీ ఎలా ప్రారంభిస్తారు అని కూడా కామెంట్స్ చేస్తున్నారు. అయోధ్యలో మోడీ సహా బీజేపీ ప్రముఖులు అంతా హాజరై పూర్తిగా సొంత కార్యక్రమంగా చేశారని రాజకీయంగానే జరిగింది అంటున్నారు. అంతా రామమయం అని అనాల్సిన చోట మోడీ మయం అయింది అని కూడా విమర్శిస్తున్నాయి. నిజానికి చూస్తే అయోధ్య రామమందిరం ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఎవరికి ఆహ్వానలు ఎవరి చేత బాల రాముని విగ్రహం ప్రారంభించాలి అన్నది ట్రస్ట్ నిర్ణయించింది. స్వతహాగా బీజేపీ అయోధ్య కోసం పోరాడింది కాబట్టి ఆ పార్టీ ప్రధానికి ఆహ్వానం అందిందింది. అలాగే దేశంలోని జాతీయ పార్టీలకు విపక్ష పార్టీలకు ఆహ్వానాలు పంపింది. అయితే ఈ కార్యక్రమానికి ఇండియా కూటమి లోని పార్టీలు కాంగ్రెస్ సహా అన్నీ హాజరు కాలేదు. జనవరి 22న ప్రతిపక్ష పార్టీలు ఏమి చేశాయని చూస్తే పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మత సామరస్య యాత్రలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొన్నారు. అదే ఉత్తరప్రదేశ్‌ని పాలిచిన ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ దుమ్మా కొట్టారు. బీహార్ మాజీ సీఎం లాలూ యాదవ్ సైతం వెళ్లలేదు. శరద్ పవార్ వంటి సీనియర్ నేతలు కూడా తాము వెళ్లమని చెప్పేశారు. ఇక కమ్యూనిస్టుల సంగతి సరేసరి ఇలా ఎందుకు జరిగింది అంటే ఒకటి వారు చెప్పే మాట అక్కడ బీజేపీ మయంగా అంతా ఉందని. మరొకటి ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాకముందే రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయడం మంచిది కాదని. ఏది ఏమైనా విపక్షాలు రాలేదు. అదే టైం లో విపక్షాల నుంచి ఒక పోలిక కూడా వస్తోంది. ఆనాడు అంటే 1951లో పండిట్ నెహ్రూ దేశానికి ప్రధానిగా ఉండగా సోమనాథ్ ఆలయం నిర్మాణం జరిగింది. దానికి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి నెహ్రూకి ఆహ్వానం వస్తే ఆయన వెళ్లలేదు. అంతే కాదు తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ ని సైతం ఆయన వెళ్లవద్దని సలహా ఇచ్చారు. భారత దేశం లౌకిక దేశమని ఎన్నో మతాలు వాటిని విశ్వసించేవరూ ఉంటారని ప్రభుత్వానికి ఏ మతమైనా సమానమే అన్నది నెహ్రూ భావన అని విపక్షాలు అంటున్నాయి. మరి నేడు చూస్తే అయోధ్యలో అంతా దేశాన్ని ఏలే పార్టీ కార్యక్రమంగానే కనిపించిందని విపక్షాలు అంటున్నాయి. అక్కడే నెహ్రూకి ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఉందని అంటున్నాయి. నరేంద్ర మోడీ ఈ కార్యక్రమలో పాలు పంచుకోవడం తనకు గర్వ కారణం అని అంటే నాడు నెహ్రూ మత కార్యక్రమాలకు దూరంగా ఉండడం ఉత్తమం అని అనుకునే వారని చెబుతున్నారు. ఇక ఆనాడు సోమ నాథ్ ఆలయం ప్రారంభం కూడా మీడియా మామూలు వార్తగానే చూసిందని నేడు కార్పోరేట్ శక్తుల చేతులలో ఉన్న మీడియా ఈ కార్యక్రమాన్ని బీజేపీ మెప్పు కోసం హైలెట్ చేసిందని అంటున్నాయి. ఏది ఏమైనా రాముడు అందరికీ దేవుడు. ఆ విషయంలో ఎవరికీ రెండవ మాట లేదని, అదే టైం లో పాలకులు మాత్రం మత కార్యక్రమాలకు దూరంగా ఉండాలని మతాన్ని రాజకీయాల్లోకి వాడుకోరాదని మేధావులు అంటున్నారు. అయితే దీని మీద బీజేపీ వైపు వాదన కూడా మరోలా ఉంది. సోమనాథ్ ఆలయం సందర్భం వేరు. అయోధ్య సందర్భం వేరు అని అంటున్నారు. అయోధ్య వెనక అయిదు వందల ఏళ్ళ పోరాటం ఉందని, ఇది స్వాభిమానం కోసం జరిగిన పోరు అని అంటున్నారు. ప్రజలు అంతా కూడా సామరస్యంగా ఉండాలని కోరుకున్న పాలకులు ఇలాంటి కార్యక్రమాల ద్వారానే సందేశాన్ని ఇవ్వగలరని కూడా చెబుతున్నారు. ఏది ఏమైనా బీజేపీ విషయంలో విపక్షాలు విమర్శలు చేస్తూ దూరం జరిగాయి. బీజేపీ మాత్రం రాముడు మా వాడు అని అయోధ్యలో హాయిగా తన పని తాను పూర్తి చేసుకుంది అని అంటున్నారు. ఇక మరో మాట కూడా ఉంది. ఇది కచ్చితంగా 1951 మాత్రం కాదు అనే వారూ ఉన్నారు. నాడు బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్రం పొందిన తరువాత కొత్తగా భారతీయ ప్రభుత్వం వచ్చింది. అయితే ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో హిందువుల మీద దాడులు పెరిగినా పట్టించుకోని సూడో సెక్యులరిజం పెత్తనమేలిందని, ఇపుడు హైందవ చైతన్యం వెల్లి విరిసిందని దాని ఫలితమే పాలకులు కూడా దిగి వస్తున్నారు అని అంటున్న వారూ ఉన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదు కార్యక్రమానికి అపూర్వ స్పందన...

### ఫారం 6,7,8 ద్వారా 1,91,120 దరఖాస్తుల స్వీకరణ..

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని ఈ విషయంలో బూత్ లెవల్ అధికారుల నుంచి ప్రతి ఒక్కరు తమ విధులు సక్రమంగా నిర్వహించారని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినందుకు రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టగా ఫారం%--%6కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1,03,688 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. అలాగే ఫారం 7కు సంబంధించి 37,139, ఫారం 8కు సంబంధించి 50,293, మొత్తం 1,91,120 స్వీకరించి వాటిని నమోదు (ఎంట్రీ) చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. యువకులైన ఓటర్లు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే ఈనెల 25న (గురువారం) జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కూకట్పల్లి జేఎన్టీయూలో జరిగే ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్రాజ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొంటారని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జరగనున్న కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా సైతం ఓటరు ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించాలి...

### జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రం ఆవిష్కరించిన కలెక్టర్ గౌతమ్..






జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త ): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించినట్లయితే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో జిల్లా ట్రాన్స్పోర్టు అధికారి కిషన్తో కలిసి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల2024, కు సంబంధించిన కరపత్రాన్ని, బ్యానర్, లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఈ మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మోటారు వాహనాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని ప్రస్తుత వేగవంతమైన, పోటీతత్వంలోని మానవతప్పిదాల వల్ల, అతివేగంగా వాహానాలను నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కలెక్టర్ గౌతమ్ వివరించారు. ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిని నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు విచ్చిన్నం కావడంతో పాటు ఎంతో మంది క్షతగాత్రు లు కావడం ఎంతో బాధాకరమని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. దీంతో పాటు రహదారి ప్రమాదాలతో వారిపై ఆధారపడిన కుటుంబాలు సైతం అనాధలవుతున్నాయని దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి జాగ్రత్తగా వాహనాలు నడపాలని కలెక్టర్ సూచించారు. అలాగే అతివేగం ప్రమాదకరమని మద్యం సేవించి, సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని డ్రైవింగ్ లైసెన్సులు లేని వారు వాహనాలు నడపరాదని కలెక్టర్ గౌతమ్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని కలెక్టర్ గౌతమ్ ఆకాంక్షించారు.

## బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళాలి..

### జాతీయ బాలికల దినోత్సవంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి ...






జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త ): బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమాన్ని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మరింత ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందని బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి అన్నారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో 14వ జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, మాట్లాడుతూ... బాలికలకు ఉండే హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకారం వంటి అంశాలపై అవగాహనా కలిగిస్తూ దేశంలో బాలికలను ముందుకు నడిపించేందుకు బాలికల సంఖ్యను పెంచేందుకు, వారికి తగిన రక్షణ, ఆరోగ్యకర వాతావరణం కల్పించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో వివరించారు. "భేటీ బచావో భేటీ పడావో "అనే పథకంతో దేశ వ్యాప్తంగా బాలికల రక్షణ, చదువు దిశగా ప్రయత్నిస్తుందన్నారు. బాలికల సంక్షేమం కోసం జరుగుతున్న కార్యక్రమాలను మరింత ముందుకి తీసుకెళ్తుందని తెలిపారు. అనంతరము బాలికలు సమాజానికి మణిహారం, బాలికలకు రక్షణ కల్పిద్దాం వారి బంగారు భవితకు పునాది వేదం స్వేచ్ఛా యుతమైన వాతావరణం మరియు పోషకాహారం అందించి వారి అభివృద్ధికి తోడ్పడుదాం బాలికలను బ్రతకనిద్దాం, చదవనిద్ధం 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేద్దాం మన వంతు సహాయం అందించి బంగారు తెలంగాణకు బాటలు వేద్దామని అదనపు కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కమిటీ ఛైర్పర్సన్ రాజారెడ్డి, కమిటి సభ్యులు, జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ రఘునాథ్ స్వామి, జిల్లా విద్యా శాఖ అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, రాచకొండ, సైబరాబాద్ షీ- టీమ్ అధికారులు, ఎన్జీవో, మహిళా శిశు సంక్షేమ శాఖ తరపున సీడీపీవోలు, సూపర్వైజర్లు, మహిళా సాధికారత బృంద సభ్యులు, ఐసీపీఎల్, ఐసీడీఎస్ చైల్డ్ లైన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల దినోత్సవం వారోత్సవాలలో వివిధ పాఠశాలలు, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ లో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

## జాతీయస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైన విద్యార్థికి అభినందనల వెల్లువ

శామీర్ పేట, (గరుడ వార్త): జాతీయస్థాయి అండర్ 14 ఖో-ఖో పోటీలకు ఎంపికైన విద్యార్థి సాయిని కౌన్సిలర్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన జి. సాయి 7వ తరగతి విద్యార్థి జాతీయస్థాయి అండర్ 14 ఖో ఖో పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక కౌన్సిలర్ రాజు యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని





పాఠశాల స్థాయి క్రీడోత్సవాలని కౌన్సిలర్ రాజు యాదవ్ ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడానికి రూ. 5000 రూపాయలు అందజేశాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మేరీ, నాగ శారద, అన్నపూర్ణ, వనజ, రజిని తిరుమలేష్ , వరలక్ష్మి, అమీనా, శ్రీదేవి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ లెక్చరర్స్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి.ప్రొఫెసర్ కోదండరాం..

ఓయూ : తెలంగాణ రిటైర్డ్ లెక్చరర్స్ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని ఈ వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు రిటైర్డ్ అధ్యాపకులు అందరూ తమ వంతు కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. బుధవారం ఓయూలోని ఆంధ్ర మహిళా సభ కళాశాల ఆవరణలో తెలంగాణ రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నూతన డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోదండరాం హాజరై



వాటిని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో యూనివర్సిటీలో అధ్యాపకుల పోస్టులను గత ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యాపకులు సీనియార్టీ ప్రకారం రావాల్సిన ప్రమోషన్లు రాలేదని తెలిపారు. రిటైర్డ్ అయిన అధ్యాపకులకు రావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు డిమాండ్ల పరిష్కారం జరిగేందుకు అందరు కలిసికట్టుగా రావాలని సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సిహెచ్ పిచ్చయ్య, ఏ పుల్లయ్య, సహాయ కార్యదర్శి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ప్రొఫెసర్లదే..

### ఓయూ రిజిస్టర్ ప్రొఫెసర్ పి లక్ష్మీనారాయణ..

### ఘనంగా మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ సర్వోత్సవాల వేడుకలు

ఓయూ : ఆచార్యుల సేవలు చిరస్మరణీయ మని, విద్యార్థులు తీర్చిదిద్దున ఘనత ప్రొఫెసర్లదే అని ఓయూ రిజిస్టర్ ప్రొఫెసర్ పి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ సర్వోత్సవాలు బుధవారం ముగింపు వేడుకలు ఠాగూర్ ఆడిటోరియంలో జరిగాయి. డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ శ్రీరాములు అధ్యక్షతన రిటైర్డ్ ప్రొఫెసర్లు వై జంగిర్, మధుసూదన్ రెడ్డి, శర్మ, మూర్తి, మల్లికార్జున్ రెడ్డి ని ఘనంగా



సన్మానించారు. అనంతరం ఓయూ రిజిస్టర్ ప్రొఫెసర్ వి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రొఫెసర్లు రిటైర్డ్ ప్రొఫెసర్లు విద్యార్థులు పూర్వ విద్యార్థుల కృషి ఫలితంగా సర్వోత్సవాలు విజయవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. బిజినెస్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి శ్రీరాములు మాట్లాడుతూ ఎంతోమంది ఆచార్యులకు కృషి ఫలితంగానే బిజినెస్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ అత్యున్నత స్థాయిలో ఉందన్నారు. త్వరలోనే గోల్డెన్ జూబ్లీ భవనం కూడా నిర్మాణం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 102 గుర్తింపు పొందిన కళాశాలతో నిర్వహించిన సెమినార్ ప్రపంచ రికార్డును సాధించడాన్ని అభినందించారు.. ఇందుకోసం కృషి చేసిన డిపార్ట్మెంట్ ప్రొఫెసర్లకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో 15 మంది రిటైర్డ్ ప్రొఫెసర్లు, 600 మంది గుర్తింపు పొందిన కళాశాల అధ్యాపకులు, 500 మంది విద్యార్థులు, 200 మంది పూర్వ విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

# ప్రయోగశాలలిలా..
# పరీక్షలు నిర్వహించేదెలా?

జనగామ : విద్యార్థులు పుస్తకాల్లో చదువుకున్న పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా పరిశీలించినప్పుడే వారిలో అవగాహన పెరుగుతుంది. ఇందుకోసమే ఇంటర్మీడియట్ సైన్సు గ్రూపుల విద్యార్థులకు రాత పరీక్షలతో పాటు ప్రయోగ (ప్రాక్టికల్) పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఫిబ్రవరి 1 నుంచి ప్రయోగ పరీక్షలు, 28 నుంచి రాత పరీక్షలు జరగనున్నాయి. గణిత విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్రాల్లో, బైపీసీ విద్యార్థులకు వాటితో పాటు వృక్ష, జంతుశాస్త్రాల్లో ప్రయోగ పరీక్షలుంటాయి. ప్రయోగ పరీక్ష నేపథ్యంలో జిల్లాలో పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలల్లోని సౌకర్యాలను పరిశీలించింది.

నిధుల కొరతతో నీరసించిన బోధన

ఇంటర్మీడియట్ పాఠ్యాంశాల బోధనకు ఇచ్చినంత ప్రాధాన్యాన్ని ప్రాక్టికల్స్ తరగతులకు ఇవ్వడం లేదు. ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రయోగాలు నిర్వహించేందుకు అవసరమైన సౌకర్యాలు కొన్ని కళాశాలల్లో లేవు. వసతి ఉన్నప్పటికీ.. సిలబస్‌కు అనుగుణంగా రసాయన పదార్థాలు, పరికరాలు లేవు. ప్రయోగశాలల నిర్వహణకు, వస్తు సామగ్రి కొనుగోళ్లకు ప్రత్యేక బడ్జెట్ లేకపోవడం భారంగా మారింది. 50 కంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్న కళాశాలల విద్యార్థులు మరోచోట ప్రయోగ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. పూర్తి స్థాయిలో శిక్షణ పొందని విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

తరగతి గదుల్లోనే ..జనగామలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్సు గ్రూపుల్లో 40 మంది, వృత్తి విద్యాకోర్సుల్లో 150 మంది విద్యార్థులు ఉన్నారు.ప్రయోగాలకు ప్రత్యేక గది లేకపోవడంతో తరగతి గదుల్లోనే ప్రయోగ తరగతులు నిర్వహిస్తున్నారు. స్లైడ్లు, స్పెసిమెన్స్, ఛార్టులు ఉన్నాయి. కాలం చెల్లిన రసాయన పదార్థాలతో ప్రయోగాలు చేయడం వల్ల ఫలితాలు రావడం లేదు. నిర్వహణ నిధుల కోసం ప్రతిపాదనలు పంపించారు. ఇతర కళాశాలల విద్యార్థులకు ప్రయోగ పరీక్ష కేంద్రంగా ఈ కళాశాలను ఎంపిక చేస్తున్నారు. అందుబాటులో ఉన్న వ్యవస్థ చాలడం లేదు.

పూర్తయిన సిలబస్

నర్మెట్ట : నర్మెట్టలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 17, బైపీసీలో 23 మంది, ఆదర్శ పాఠశాలలో ద్వితీయ ఏడాది ఎంపీసీలో 26, బైపీసీలో 45 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రాక్టికల్స్ సిలబస్ పూర్తయింది. ప్రయోగాలకు అవసరమైన పరికరాలు, రసాయనాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

సొంత ఖర్చులతో సైన్సు పరికరాలు

జఫర్‌గఢ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో 81 మంది, ద్వితీయ సంవత్సరంలో 117 మంది విద్యార్థులున్నారు. మూడేళ్ల నుంచి సైన్సు పరికరాలు, రసాయనాలను సరఫరా చేయలేదు. కళాశాల అధ్యాపకులే తమ సొంత ఖర్చులతో వాటిని సమకూర్చుకున్నారు. సూక్ష్మదర్శిని, రసాయనాలు, స్టాండ్స్, కేశ నాళికలు, గ్రాఫిక్ బుక్స్, మీటర్ స్కేలు, క్యాండిల్, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించిన సామగ్రి లేకపోవడంతో అధ్యాపకులు పాత చిత్రాల ఆధారంగా బోధిస్తున్నారు. : స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రయోగ పరికరాలు లేవు. చిత్ర పటాలతోనే పాఠాలు బోధిస్తున్నారు. ప్రయోగశాల నామమాత్రంగా ఉంది. రఘునాథపల్లి మండలంలోని ఆదర్శ జూనియర్ కళాశాలలో సైన్స్ విద్యార్థులకు కావాల్సిన పరికరాలు లేవు. థర్మో, డిజిటల్ మీటర్లు, భౌతిక, రసాయన, జంతుశాస్త్ర సంబంధిత పరికరాలు లేకపోవడంతో అధ్యాపకులు బోర్డుపై చిత్రాల ద్వారా బోధిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

దేవరుప్పుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ప్రయోగశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. రసాయనాలు, లవణాలు, పరికరాలు, విద్యుత్తు సౌకర్యం ఉన్నాయి. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 42 మంది ఉన్నారు. ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధ్యాపకులు తెలిపారు. ఇబ్బందులు లేకుండా చూస్తాం– బైరి శ్రీనివాస్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

నిర్వహణ భారంగా ఉన్నా.. విద్యార్థులకు సిలబస్ ప్రకారం ప్రయోగ తరగతులు జరిగేలా చర్యలు తీసుకున్నాం. ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# ఎట్టకేలకు ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్

నిజామాబాద్ : ప్రభుత్వ పాఠశాల విద్యా కమిటీల పదవీకాలం తరచూ పొడగిస్తూ వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ ఎట్టకేలకు ఎన్నికల షెడ్యూల్‌ను శుక్రవారం జారీ చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొననుంది. ప్రభుత్వ బడుల్లో చేపట్టే అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునే ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. చివరి సారి 2019 నవంబరులో విద్యా కమిటీ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించింది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం అనేక వాయిదాల ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఉమ్మడి జిల్లాలో 1409 ప్రాథమిక, 362 ప్రాథమికోన్నత, 437 ఉన్నత పాఠశాలలతో పాటు 44 కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, యూఆర్ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నెల 29న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది.

20 తేదీ ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయుడు నోటీసు జారీ చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లను పాఠశాల ఆవరణలో ప్రదర్శించాలి.

22న ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు.

24న పోటీలో ఉన్నవారి తుది జాబితా ప్రదర్శిస్తారు.

29న ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు కొత్తగా ఏర్పడిన కమిటీతో సమావేశం నిర్వహించి బడిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించాలి.

నిబంధనల ప్రకారం

ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు మరో ఐదుగురు ఎక్స్‌ఆఫీషియో సభ్యులుగా, ఇద్దరు కోఆప్షన్ సభ్యులుంటారు. ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 1–8 తరగతుల్లోని విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులుగా ఉంటారు. 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీ చేసే అవకాశం లేదు. ఎన్నికల నిర్వహించే సమయంలో కనీసం 50 శాతం తల్లిదండ్రులు హాజరుకావాలి. చేతులెత్తే పద్ధతి/వాయిస్ ఓటు పద్ధతుల్లో ఎన్నికలు నిర్వహించాలి. ప్రధానోపాధ్యాయులు వీటిని నిర్వహిస్తారు. పక్కాగా నిర్వహించాలి– దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నాం. షెడ్యూల్‌ను ప్రధానోపాధ్యాయులు క్షుణ్ణంగా చదివి ప్రక్రియ పక్కాగా నిర్వహించాలి. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలి.

# నిరుద్యోగ యువతకు పునాది



సిద్దిపేట : నిరుద్యోగ యువతకు స్టడీ సర్కిళ్లు బాసటగా నిలుస్తున్నాయి. శిక్షణ ద్వారా వారి బంగారు భవితకు బాటలు వేస్తున్నాయి. రూ.వేలల్లో రుసుములు చెల్లించలేని ఎంతో మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారికి ఊరటగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల ప్రకటనలకు సన్నద్ధమవుతున్న తరుణంలో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా గ్రూప్స్‌కు అనుబంధంగా ఫౌండేషన్ కోర్సును అందించేందుకు సన్నద్ధమవుతోంది. గ్రూప్–1,2,3,4 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 12 సర్కిళ్లు ఉండగా.. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ నేటి (శనివారం)తో ముగియనుంది. ఫిబ్రవరి 1 నుంచి తరగతులు మొదలవనున్నాయి.

2015లో..సిద్దిపేటలో బీసీ స్టడీ సర్కిల్ 2015లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం మున్సిపల్‌కు చెందిన తాత్కాలిక భవనంలో కొనసాగుతోంది. ఏటా దాదాపు 500 మంది వివిధ అంశాల్లో తర్ఫీదు పొందుతున్నారు. నాటి నుంచి 150 మంది కానిస్టేబుల్, జూనియర్ లైన్‌మెన్స్, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, మరో 350 మంది ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం. గ్రూప్స్, డీఎస్సీ, గురుకులాలు, పోలీసు, విద్యుత్తు, ఇతర శాఖల్లో నోటిఫికేషన్‌లు వెలువడిన సందర్భం, ఇతర సమయాల్లో శిక్షణలు కొనసాగుతున్నాయి. మూడు నెలల పాటు ఒక్కో కోర్సును నిర్వహిస్తున్నారు.

100 రోజులు

గ్రూప్స్‌కు సంబంధించిన ఫౌండేషన్ కోర్సును 100 రోజుల పాటు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. అర్హత మేర జిల్లా పరిధిలోని 100 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. విద్యా సామగ్రిని అందిస్తారు. 15 నుంచి 20 మంది విషయ నిపుణులు బోధిస్తారు. రోజులో మొత్తం ఆరు గంటల పాటు తరగతులు ఉంటాయి. రోజువారీగా, వివిధ దశల్లో పరీక్షల ద్వారా సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రానున్న రోజుల్లో సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు శిక్షణ అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. పి.కృష్ణదయాసాగర్ తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే ఫోన్ నం. 08457 224941, చరవాణి నం. 99666 73095 లేదా సిద్దిపేటలోని పాత డీఈవో కార్యాలయం పక్కన బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలి.

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్ యువతకు దిక్సూచిగా నిలిచింది. మెదక్ జిల్లావాసులు సైతం ఇక్కడే శిక్షణ పొందాల్సి ఉంటుంది. వంద మందికి అవకాశం కల్పిస్తారు. ఆగస్టు నుంచి అంతర్జాలంలో 56 మందికి డీఎస్సీ ఉచిత తర్ఫీదు ఇస్తున్నారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్ తెలిపారు.

దరఖాస్తు ఇలా..

%www.tsbcstudycircle.cgg.gov.in% వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలి. నేటి వరకు గడువు ఉంది. పోటీ తీవ్రత మేర ప్రవేశ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. 75 శాతం బీసీ, 15 శాతం ఎస్సీ, 5 శాతం చొప్పున ఎస్టీ, ఈబీసీలకు ప్రవేశ రిజర్వేషన్లు వర్తిస్తాయి. శిక్షణపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్‌ఫొటోలు జతపర్చాలి. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలు మించొద్దు. జిల్లాల వారీగా దరఖాస్తు చేసుకోవాలి.

# హడలెత్తిస్తున్న అవిశ్వాసం



మెదక్ : రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పురపాలికల్లో అవిశ్వాసాల జోరు పెరుగుతోంది. ఆయా పార్టీలకు పూర్తిస్థాయిలో సంఖ్యా బలం ఉండడం, ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న వారు ఇతర పార్టీలకు చెందిన వారు కావడంతో అవిశ్వాస తీర్మానానికి నోటీసులు అందజేస్తున్నారు. దీంతో ఆయా చోట్ల ఛైర్మన్లు మారుతున్నారు. పదవీకాలం మరో ఏడాది మాత్రమే ఉన్నా.. పలువురు ప్రజాప్రతినిధులు తమ పంతం నెగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక చోట నోటీసు అందిస్తే...మరోచోట ముసలం నెలకొంటోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత అవిశ్వాసాల జోరు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ అంశంపై కథనం...

కొత్త సర్కారు రావడంతో

జిల్లాలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పురపాలికలు ఉన్నాయి. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అన్నిచోట్లా భారాస(నాటి తెరాస) పార్టీ 'పుర' పీఠాలను కైవసం చేసుకుంది. వీరి పదవీకాలం 2025 జనవరి 27 వరకు ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయా చోట్ల పురపాలికల ఛైర్మన్లు కొందరు పార్టీ మారడం, లేదా ఎమ్మెల్యే అధికార పార్టీకి చెందిన వారు ఉండడంతో పురపాలిక ఛైర్మన్లపై అవిశ్వాసం ప్రవేశపెడుతున్నారు.

నర్సాపూర్‌లో అమలు...నర్సాపూర్ పురపాలిక ఛైర్మన్ మురళీయాదవ్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసును భారాసకు చెందిన కౌన్సిలర్లు అందజేశారు. ఆయనకు తగిన సంఖ్యాబలం లేకపోవడంతో ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ ఛైర్మన్ నయిమోద్దీన్‌కు ఇన్‌ఛార్జి ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారు. అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడంతో అధికారులు ఈనెల 29న సమావేశం నిర్వహించనున్నట్టు తెలిసింది. ఆ రోజున పురపాలిక ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. తొమ్మిది మంది భారాస కౌన్సిలర్లు, ఆరుగురు భాజపా కౌన్సిలర్లు ఉన్నారు. ఛైర్మన్ రేసులో భారాసకు చెందిన కౌన్సిలర్ అశోక్‌గౌడ్ ఉన్నారు.

ప్రస్తుతానికి ప్రశాంతం

రామాయంపేట పురపాలికలో తొమ్మిది మంది భారాస, ఇద్దరు కాంగ్రెస్, ఒక్కరు భాజపా తరఫున గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, భాజపాకు చెందిన కౌన్సిలర్లు భారాసలో చేరారు. దీంతో మొత్తం 12 వార్డుల కౌన్సిలర్లు భారాసకు చెందిన వారే ఉన్నారు. ఇక్కడ అవిశ్వాస తీర్మానంపై ప్రస్తుతానికి ఎలాంటి ఆలోచన లేదు.

తూప్రాన్‌లో అంతర్గతంగా..

గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే తూప్రాన్ పురపాలికలో మొత్తం 16 వార్డులు ఉన్నాయి. 2020లో ఇందులో 11 భారాస, రెండు కాంగ్రెస్, ఒక స్థానంలో భాజపా, రెండు చోట్ల స్వతంత్రులు గెలుపొందారు. స్వతంత్రులు భారాసలో చేరడంతో వారి సంఖ్య 13కు చేరుకుంది. భారాసలో రెండు వర్గాలు ఉన్నాయి. అవిశ్వాసంపై అధికారికంగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు ఇవ్వలేదు. కానీ అంతర్గతంగా ప్రయత్నాలు చేసినప్పటికీ, సరైన మద్దతు లేకపోవడంతో ఆలోచనను ఉపసంహరించుకున్నారు. భారాసలో ఉన్న కొందరు కౌన్సిలర్లు లోక్‌సభ ఎన్నికల అనంతరం హస్తం పార్టీలోకి చేరేందుకు ఆ పార్టీ నేతలతో మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం.

మెదక్‌లో అసంతృప్తి మెదక్‌లో 32 వార్డులుండగా, 2020 ఎన్నికల్లో భారాస 18 వార్డుల్లో, కాంగ్రెస్ తొమ్మిది, భాజపా మూడు, ఒక ఎంఐఎం, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు భారాసలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక భారాస కౌన్సిలర్, ఓ స్వతంత్ర కౌన్సిలర్ హస్తంలో చేరారు. దీంతో భారాసకు ప్రస్తుతం 26 మంది, కాంగ్రెస్‌కు నలుగురు, భాజపా, ఎంఐఎం తరఫున ఒక్కొక్కరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారాసకు అత్యధిక మంది కౌన్సిలర్లు ఉన్నప్పటికీ ప్రస్తుత ఛైర్మన్‌పై కొందరు కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఆయా చోట్ల అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టడంతో దీనిని సాకుగా చూపి కొంత ప్రయోజనం పొందాలని కొందరు కౌన్సిలర్లు భావిస్తున్నట్టు తెలిసింది. అవిశ్వాసం లేకపోతే విహారయాత్రకు తీసుకెళ్లాలని ఛైర్మన్‌ను కోరాలని పలువురు కౌన్సిలర్లు నిర్ణయించినట్లు సమాచారం.

# ఆలోచన.. ఆచరణ.. ఆదాయం

వేల్పూర్ : సోయాబీన్ విత్తనాల కోసం రైతుల పోరాటం అంతాఇంతా కాదు. ప్రభుత్వం నుంచి రాయితీ విత్తనాలు పంపిణీ నిలిపివేసిన అనంతరం ప్రైవేటు వ్యాపారులు విత్తన ధరలు అమాంతం పెంచేశారు. ప్రభుత్వం 30 కిలోల బస్తా ధర రూ.వెయ్యి లోపు లభిస్తే ప్రైవేటు వ్యాపారులు దానిని రూ.4 వేలకు పెంచేశారు. వాతావరణ మార్పులు, విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులకు పెట్టుబడి తడిసి మోపెడయ్యేది. దీంతో కొందరు రైతులు ఎకరం, రెండు ఎకరాల్లోనే సాగు చేయడం మొదలుపెట్టారు. ఇలాంటి తరుణంలో కొందరు రైతులు విత్తనోత్పత్తి సాగు చేస్తే బాగుంటుందని ఆలోచించారు. ఆ దిశలో సాగు చేపట్టి వచ్చిన దిగుబడిని వచ్చే సీజన్‌కు వినియోగించడమే కాకుండా ఇతర రైతులకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు.

క్వింటాకు రూ.13 వేలకు పైగాయాసంగిలో సాధారణ రకం సోయా క్వింటాకు వ్యాపారులు రూ.4100 చెల్లించారు. అయితే ఈ రకం సాగులో ఎకరాకి ఆరు క్వింటాళ్ల దిగుబడి మించి రాలేదు. కానీ విత్తన రకం 30 కిలోల బస్తా రూ.4 వేలకు కొనుగోలు చేశారు. అంటే క్వింటా ధర రూ.13 వేల పైమాటే. ఈ రకం విత్తనం సాగుచేయడం ద్వారా ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. సాగు అనంతరం మరుసటి పంటకు విత్తనాల కొనుగోలు అవసరం లేదని.. ఇతరులకు విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందుతున్నామని పేర్కొంటున్నారు.

బస్తాకు రూ. 3,500..– లారీ బాల్‌రాజ్, రైతు, వేల్పూర్ఎకరా విస్తీర్ణంలో విత్తన సోయా సాగు చేశా. ప్రస్తుతం పంట చేతికి అందే దశలో ఉంది. 10 క్వింటాళ్లకు దిగుబడి వస్తుంది. నా అవసరాలకు పోను తోటి రైతులకు 30 కిలోల బస్తాకు రూ.3500 చెల్లించినా క్వింటాకు రూ.10 వేలకి పైగా ఆదాయం వస్తుంది. గతేడాది నుంచి విత్తన సాగు చేస్తున్నా. ఈ పద్ధతి ద్వారా రైతులకు పెట్టుబడి ఆదా అవుతుంది.

# కబ్జాలపై అధికారుల్లో కదలిక

నిజామాబాద్ : బడారాంమఠ్ (పెద్ద రాంమందిర్)కు చెందిన భూములు కబ్జా ప్రదేశాలను దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆయా భూముల్లో నిర్మాణాలు ఏమున్నాయి? పొలం సాగు చేసుకుంటున్న వారెవరు? తదితర వివరాలపై ఆరా తీశారు. కథనానికి స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మోకాపై పరిస్థితిని ఏమిటో తనిఖీ చేశారు. నిజామాబాద్ నగర శివారు, రూరల్ మండలం, మోపాల్, రెంజల్, నందిపేట్ మండలాల్లో మఠానికి చెందిన 213.10 ఎకరాల భూమి ఉంది. వీటిల్లో తొలిరోజు నిజామాబాద్ నగర శివారులోని నాల్‌క్యాల్ సమీప ప్రాంతంలోని నాలుగు సర్వే నెంబర్లలోని 9.11 ఎకరాలు, మరోచోట 9 సర్వే నెంబర్లలోని 28.32 ఎకరాల వ్యవసాయ భూమిని పరిశీలించారు.

సాగు భూములదీ అదే పరిస్థితి..

అధికారులు నగర శివారులోని 9 సర్వే నెంబర్లలోని 28.32 ఎకరాల్లో పరిస్థితి ఏంటని వెళ్లి చూడగా అక్కడ పంటల సాగు జరుగుతోంది. వీరంతా కౌలు పొంది సాగు చేస్తున్నట్లు రికార్డులో ఉంది. కానీ, కౌలు డబ్బులు మఠానికి చెల్లించటం లేదని గుర్తించారు. ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు వసూలు చేస్తూ, ఎటువంటి రశీదులు ఇవ్వటం లేదనే విషయం వెలుగుచూసింది. ఇవి కాకుండా ఇతర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములు సైతం కౌలు కింద పలుకుబడి కలిగిన వ్యక్తులు గతంలో తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే వీరెవరు కౌలు చెల్లించకపోగా, ఆ భూమి ఇప్పుడు తమదే అంటూ వాదన వినిపిస్తుండటం గమనార్హం.

నోటీసులు.. కేసులకు వెనకడుగు

దేవాదాయశాఖ అధికారులు కబ్జాల విషయంలో కదిలినప్పటికీ ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వటంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. బెదిరింపులకు దిగుతున్నవారిపై కేసులు పెట్టే అవకాశం ఉన్నా వెనకడుగువేస్తున్నారు. తమకు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్న వారు ఉన్నతస్థాయికి విషయం తీసుకెళ్లటం లేదు. ఇంత పెద్దమొత్తంలో భూమి అన్యాక్రాంతమైనా.. ప్రత్యేకంగా ఎందుకు సమీక్షించటం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపితే తప్ప కబ్జా చెరను వీడేలా లేవు.

కలెక్టర్ సహకారం కోసం లేఖ

సిబ్బంది కొరతకు తోడు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన సందర్భంలో కబ్జాదారులు తమను బెదిరిస్తున్నారని అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లా అధికారుల సహకారం అవసరం. ఇందు కోసం లేఖను కలెక్టరేట్ ఇన్‌వార్డులో ఇచ్చామంటున్నారు. భూ హద్దుల గుర్తింపు, స్వాధీనం సందర్భంలో పోలీసు, రెవెన్యూ సర్వేయర్లు తమకు సహకరించాలని దేవాదాయ సహాయ కమిషనర్ కోరుతున్నారు.

ఆక్రమణదారుల నుంచి అడ్డంకులు

నగర శివారులో నాలుగు సర్వే నెంబర్లలో కలిపి ఓ వ్యక్తి 9.11 ఎకరాలు కబ్జాలో ఉన్నారు. గతంలో ఈయన తన పేరుపై పట్టాలు చేయించుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అయితే ఆ భూమిని స్వాధీనం చేసుకొని నిషేధిత జాబితాలోకి తీసుకురావాల్సిన అధికారులు, మీనమేషాలు లెక్కించారు. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు తనిఖీల్లో భాగంగా ఆ భూమి ప్రదేశానికి వెళ్లారు. ఓ వ్యక్తి అక్కడికి చేరుకొని ఇది తమదే అని, తాతల నాటి నుంచి తమ ఆధీనంలోనే ఉందని చెప్పటం గమనార్హం. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. 9.11 ఎకరాలే కాదు, తమ కింద 40 ఎకరాలు ఉందని చెప్పడం గమనార్హం. అందులో 9.11 ఎకరాలు పోను, మిగతాది ఇతరులకు లీజుకు ఇచ్చి వారి నుంచి డబ్బు వసూలు చేసి మఠంలో అనధికారికంగా ఉద్యోగులుగా చలామణి అవుతున్న వ్యక్తులకు చాలాకాలంగా చెల్లిస్తున్నట్లు చెప్పాడు. డబ్బు చెల్లింపులకు రశీదులు ఉన్నాయా? అని అధికారులు ప్రశ్నించగా సదరు సిబ్బంది ఎలాంటి రసీదులు ఇవ్వలేదని చెప్పటం విశేషం. 'ఎవరు ఈ భూమి కోసం వచ్చినా తరమికొడతాం' అంటూ సదరు వ్యక్తి పేర్కొనడంతో అధికారులు అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ప్రదేశంలో కొంత ఖాళీ ప్రదేశం, కొన్ని ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రస్తుతం ఇది రూ.కోట్లలో విలువ చేస్తుందని అంటున్నారు.

బెదిరింపులు మఠం భూముల పరిరక్షణలో భాగంగా పరిశీలనకు వెళ్లిన తమపై కబ్జాలో ఉన్నవారు దౌర్జన్యానికి దిగినట్లు అధికారులు చెప్పారు. సిబ్బంది కొరతతో ఇద్దరు, ముగ్గురం క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన సందర్భంలో ఎప్పుడూ ఇదే పరిస్థితి ఉంటోందన్నారు. గతంలో మఠంలోని హుండీలను స్వాధీనం చేసుకొనేందుకు వెళ్తే ఇదే పరిస్థితి ఎదురైందని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ తెలిపారు. తాజాగా భూముల పరిశీలనకు వెళ్తే 'ఎవరొచ్చినా తరిమికొడతాం' అంటూ ఓ వ్యక్తి తమను హెచ్చరించాడని చెప్పారు. 213.10 ఎకరాల భూమిని క్షేత్రస్థాయిలో గుర్తించాలంటే తమ శాఖ సిబ్బంది సరిపోవటం లేదని ఉన్నవారు అడ్డుకుంటున్న పరిస్థితి ఉందని ఆమె వెల్లడించారు.

# ఉపాధి చూపేవారేరి..?

కామారెడ్డి : గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నిరోధించడానికి కేంద్రం 2005లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం అధికారుల కొరత వేధిస్తోంది. కామారెడ్డి జిల్లాగా ఆవిర్భవించినప్పటి నుంచి ఇదే సమస్యతో అధికారులు సతమతమవుతున్నారు. జిల్లాలో 25 మండలాలు ఉండగా అందులో సగానికి పైగా మండలాల్లో అధికారుల కొరత ఉంది. ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఎన్నిమార్లు సమస్య వినిపించినా చర్యలు శూన్యమయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో 78 మంది విధులు నిర్వహిస్తుండగా మరో 83 ఖాళీలు ఉండడం గమనార్హం. వీరే కాకుండా 246 పంచాయతీలకు క్షేత్రసహాయకులు లేరు. జిల్లాలో ఫిబ్రవరి నుంచిమొదటివారం వరకు ఉపాధి పనులు జోరుగా సాగుతాయి. భారమంతా వారిపైనే..ఉపాధిహామీ పనులను మండలాల్లో ఏపీవో, ఈసీ, టీఏలే చూసుకుంటారు. జిల్లాస్థాయిలో డీఆర్‌డీవోతో పాటు ఒక అదనపు పీడీ ఇద్దరు ఏపీడీలు ప్రత్యేకంగా పనిచేస్తారు. కూలీలకు చెల్లింపులు, కూలీలను సమన్వయం చేయడం, పరిపాలన వ్యవహారాలు చూసుకోవడం వంటి బాధ్యతలను ఏపీవోలు నిర్వహిస్తుంటారు. ఈసీలు టీఏలు నమోదు చేసిన కొలతలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. టీఏలు కూలీలను కొలతల ప్రకారం పనిచేయిస్తారు. కూలీలు చేసిన పనిని కొలిచి పుస్తకంలో నమోదు చేస్తారు. ఆయా పోస్టుల్లో సగం మంది మాత్రమే పనిచేస్తుండడంతో ఇతర మండలాలు, ఇతర గ్రామాల బాధ్యతలను కూడా మోస్తున్నారు. ఒక్కోసారి పనిభారం భరించలేక కొందరు విధుల నుంచి వైదొలుగుతున్నారు. 526 గ్రామపంచాయతీల్లో కేవలం 53 మంది టీఏలు మాత్రమే పనిచేస్తున్నారు. ఒక్కో టీఏ 10–11 గ్రామాల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక ఏపీవోలు, ఈసీలకు సైతం పక్క మండలాల బాధ్యతలు తప్పడం లేదు.

కేటాయింపులు సరిగా లేక..ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 36 మండలాలు ఉండేవి. కొత్తగా కామారెడ్డి జిల్లాను ఏర్పాటు చేశారు. పాత జిల్లా ఉన్నప్పుడు పోస్టులు సరిపడా ఉండేవి. ఉన్న పోస్టుల్లో కొన్నింటిని కామారెడ్డికి సర్దుబాటు చేశారు. కొరత ఉంటే తర్వాత భర్తీ చేస్తామని పేర్కొన్నారు. కానీ జిల్లా ఆవిర్భవించి సుమారు ఎనిమిదేళ్లు గడుస్తున్నా పోస్టుల భర్తీ ఊసే లేకుండా పోయింది. అందుబాటులో ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. క్షేత్రసహాయకులను మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. పంచాయతీల విభజన జరగక ముందు జిల్లాలో 322 గ్రామపంచాయతీలు ఉండేవి. అందులో 280 మంది క్షేత్రసహాయకులే పనిచేసేవారు. పంచాయతీల సంఖ్య 526 అయినా వారి సంఖ్య పెరుగలేదు.

# మెరుగ్గా భవితవ్యం..!

చింతకాని : బుద్ధిమాంద్యం, శారీరక వైకల్యంతో చదువుకు దూరమవుతున్న చిన్నారులకు భవిత కేంద్రాలు భరోసానిస్తున్నాయి. తమ పిల్లలను చూసి కుంగిపోతున్న తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం కన్పిస్తోంది. కొవిడ్ తర్వాత రెండేళ్లు మూతపడిన కేంద్రాలు మళ్లీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. ప్రత్యేక శిక్షణతో పిల్లలు రుగ్మతలను అధిగమిస్తున్నారు. తడబడిన అడుగులు బడిబాట పట్టాయి.

**43 రకాల పరికరాలు అందజేత**

ఉభయ జిల్లాల వ్యాప్తంగా 'ప్రత్యేక' చిన్నారులకు 43 రకాల ఉపకరణాలు, సహాయ సామగ్రి, యంత్ర పరికరాలు అందజేశారు. ఇలాంటి ప్రత్యేక పరికరాల కోసం ఖమ్మం జిల్లాలో రూ.43.68 లక్షలు మంజూరయ్యాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారుల సూచనల మేరకు ఐఈఆర్పీలు, ఫిజియోథెరపిస్టులు వారానికి ఒకరోజు శిక్షణ ఇస్తుండటంతో ప్రతి ఒక్కరిలో మార్పు కన్పించటం శుభపరిణామం.

వారానికి ఒకరోజు శిక్షణ.. అవసరమైతే శస్త్రచికిత్సలు

కొవిడ్ తరువాత ఐఈఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు ప్రత్యేక అవసరాలు కలిగిన 0-18 ఏళ్ల విద్యార్థులను గ్రామాల వారీగా గుర్తిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్, పాఠశాలకు రాలేని పిల్లల కోసం హోం బేస్డ్ ఎడ్యుకేషన్, మాటలు రాని వారికి స్పీచ్ థెరపీలో భవిత కేంద్రాల్లో వారం వారం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఫిజియోథెరపీ శిబిరాలతో తమ పిల్లల్లో మార్పు కన్పిస్తోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికే భవిత కేంద్రాలకు వచ్చే పలువురు విద్యార్థులకు కంటి ఆపరేషన్లు, గ్రహణం మొర్రి, గ్రహణ శూల, శారీరక వైకల్యం, వినికిడిలోపం ఉన్న వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించారు. తద్వారా వారిలోని వైకల్యం లోపం తొలగిపోవటంతో పూర్తిస్థాయిలో మార్పు వచ్చి సాధారణ విద్యార్థులుగా తయారవుతున్నారు.



వేంసూరు మండలం దుద్దేపూడికి చెందిన మిరియాల తనూజశ్రీకి చిన్ననాటి నుంచి దృష్టిలోపం ఉంది. తండ్రి ట్రాక్టర్ డ్రైవర్ కాగా తల్లి దినసరి కూలీ. గతేడాది తనూజశ్రీని స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించగా ఆమెకు దృష్టిలోపం ఉన్నట్లు ఉపాధ్యాయులు గుర్తించారు. కనీసం బోర్డు మీద అక్షరాలను సైతం గుర్తించలేదు. ఈ విషయాన్ని భవిత కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి ఉచితంగా శస్త్రచికిత్స చేసి రూ.30 వేల విలువైన కళ్లజోడును అందజేసేలా కృషి చేశారు. ప్రస్తుతం ఆ చిన్నారి రెండోతరగతి చదువుతూ అన్ని పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధిస్తోంది.

చింతకాని మండలం నరసింహాపురానికి చెందిన తొమ్మిదేళ్ల కర్రి విజయ్‌కు పాక్షిక పక్షవాతంతో పాటు మానసిక దివ్యాంగుడు. కనీసం కూర్చున్న చోటు నుంచి కదలలేని స్థితిలో అయిదేళ్లు గడిపాడు. దీంతో పాఠశాలకు కూడా పంపలేదు. ఈ విషయాన్ని ఐఈఆర్పీ ఉపాధ్యాయులు గుర్తించి తల్లిదండ్రులు నాగేశ్వరరావు, నీలిమకు అవగాహన కల్గించి భవిత కేంద్రానికి వారం వారం వచ్చేలా కృషి చేశారు. ప్రస్తుతం విజయ్ నడచుకుంటూ పాఠశాలకు వస్తున్నాడు.

భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారులందరిలో మార్పు తీసుకొచ్చాం. వారిలో లోపాలు గుర్తించి ప్రభుత్వం నుంచి వచ్చే ఉపకరణాలు, సామగ్రిని వెంటనే అందజేస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను సైతం గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. అర్హులైన వారు సదరం ధ్రువపత్రం పొందేలా అవగాహన కల్పిస్తున్నాం. రాజశేఖర్, మిళిత విద్య జిల్లా సమన్వయకర్త, ఖమ్మం

# అప్పుడు చేయించారు.. బిల్లులు మరిచారు!

ఖమ్మం : ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్లు తయారైంది సర్పంచుల పరిస్థితి. ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ఊరి బాగు కోసం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినా బిల్లులు రాక అష్టకష్టాలు పడుతున్నారు. ఈనెలాఖరుకు పదవీకాలం ముగుస్తుండటంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ఉభయ జిల్లాల్లో 1,070 పంచాయతీలు

ఖమ్మం జిల్లాలో 589, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 481 పంచాయతీలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సర్పంచులు అభివృద్ధి పనులు చేపట్టారు. డంపింగ్‌యార్డులు, వైకుంఠథామాలు, కమ్యూనిటీ భవనాలు, పంచాయతీ భవనాలు, రైతువేదికలు, మురుగుకాల్వలు, సీసీరోడ్ల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు, వీధిదీపాల ఏర్పాటు, మోటార్ల మరమ్మతులు తదితరాలకు రూ.లక్షలు వెచ్చించారు. సగానికి పైగా పంచాయతీల్లో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సర్పంచులు చెబుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ట్రాక్టర్‌ను ప్రతి పంచాయతీ కొనాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. అప్పులు చేసి మరీ ట్రాక్టర్లు కొన్నామని సర్పంచులు వాపోతున్నారు. నెలనెలా గ్రామపంచాయతీ వసూలుచేసిన సొమ్ము మల్టీపర్పస్ వర్కర్లు, సిబ్బంది జీతాలకే సరిపోయిందని, ట్రాక్టర్ల నిర్వహణ గుదిబండగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) నిధులు నెలల తరబడి మంజూరవటం లేదని చెబుతున్నారు.

పాలకులకు విన్నపాలు

పదవీకాలం ముగిసేలోపు బిల్లులు తెచ్చుకోవాలన్న తలంపుతో ప్రభుత్వ పెద్దల చుట్టూ సర్పంచులు ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో పలుమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా తమను కరుణించకపోతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల మధిర పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ఖమ్మం జిల్లా సర్పంచుల సంఘం ప్రతినిధులు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ రోజూ తిరగాల్సి వస్తోందని, గ్రామ పాలనపై దృష్టి సారించలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగుకాల్వల శుభ్రత, పైపులైన్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించిన ఎంబీలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఆరు నెలలుగా బిల్లులు ఖాతాలో జమకాలేదు. రూ.13 లక్షలు రావాల్సి ఉంది. ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి. ఏం చేయాలో పాలుపోవటం లేదు.

చిన్నా మోహన్‌రావు, సర్పంచి, కూసుమంచి

మా గ్రామంలో 'మన ఊరు- మన బడి', సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.70 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పులు తెచ్చి పనులు చేశాం. నెలల తరబడి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నా మంజూరవటం లేదు. ఆలస్యం నాగమణి, సర్పంచి, నాగులవంచ, చింతకాని మండలం

# చోరీల మాఫియా..పట్టుకునేదెవరయా?



మందమర్రి :మూడేళ్ల క్రితం మందమర్రి స్టోర్‌లో తాళం వేసి ఉండగానే అందులోని ఉన్న కేబుల్ చోరీకి గురైంది. 160 కిలోల రాగి తీగలు ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు వచ్చిన సిబ్బంది తాళం తెరిచి చూస్తే విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేటికీ దొంగతనం చేసింది ఎవరనేది తేల్చలేదు. ఇనుప సామగ్రి ఎత్తుకెళ్లారు. ఈ చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. దొంగల ముఖాలు కన్పిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు పట్టుకోలేదు. రామకృష్ణాపూర్‌లో ఇరవై రోజుల క్రితం మూసివేసిన కోల్‌వాషరీ ప్లాంటు నుంచి బొగ్గు చూర దొంగిలిస్తుండగా సింగరేణి రక్షణ సిబ్బంది పట్టుకున్నారు. పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎస్అండ్‌పీసీ అధికారి రామకృష్ణాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రెండు లారీలు, ఒక జేసీబీలను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అత్యంత నిఘా నీడలో ఉండే జైపూర్ ఎస్టీపీపీలోని స్టోర్‌లో గతేడాది ఫిబ్రవరిలో భారీ చోరీ జరిగింది. ఎస్ఐఎస్ఎఫ్, సింగరేణి రక్షణ వలయం కళ్లు కప్పి లోనికి చొరబడ్డ దొంగలు రూ.43 లక్షల విలువైన యంత్రాల కోసం వినియోగించే సామగ్రి ఎత్తుకెళ్లారు. పోలీసులు దొంగలు ఎవరనేది తేల్చలేదు.

సింగరేణి ప్రాంతంలో స్క్రాప్ దొంగలు రెచ్చిపోతున్నారు. ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. అడ్డొచ్చిన రక్షణ సిబ్బందిపై దాడులకు పాల్పడుతుండటం కలకలం రేపుతోంది. పక్కా ప్రణాళికతో వస్తున్న దొంగలు నిమిషాల వ్యవధిలో పని ముగించుకుని ఉడాయిస్తున్నారు. సింగరేణిలో బొగ్గు వెలికితీసేందుకు భారీ యంత్రాలు, నాణ్యమైన ఇనుప సామగ్రి వినియోగిస్తుంటారు. అవి తరచూ మరమ్మతులకు గురవుతుంటాయి. వాటిని గని ఆవరణలోని షెడ్డుకు, వర్క్‌షాప్, స్టోర్‌కు తరలిస్తుంటారు. కొందరు ఇంటి దొంగల ద్వారా సమాచారం తెలుసుకుని ఒకటి, రెండ్రోజులపాటు రాత్రి వేళలో రెక్కి నిర్వహిస్తున్నారు. సామగ్రి అధిక బరువు ఉంటుండటంతో 10 నుంచి 15 మంది ముఠాగా ఏర్పడి పక్కా ప్రణాళికతో చోరీ చేసే ప్రదేశానికి చేరుకుంటారు. కార్మికులు, ఉద్యోగుల అలికిడి లేని సమయం.. సెక్యూరిటీ ప్రొటెక్షన్ కార్ప్స్ (ఎస్అండ్‌పీసీ) ఉద్యోగులు షిఫ్టు మారే సమయంలో ఒక్కసారిగా మూకుమ్మడిగా లోనికి చొరబడుతారు. రక్షణ సిబ్బంది ఉంటే వారిపై దాడి చేసి సామగ్రి అపహరిస్తున్నారు. రక్షణ సిబ్బంది అధికారులకు సమాచారం అందించి వారు వచ్చేలోపే దొంగలు తమ పనికానిస్తుంటారు. అయిదు నుంచి 10 నిమిషాల వ్యవధిలో తాము దొంగతనం చేయాల్సిన సామగ్రి గుర్తించి పదునైన ఆయుధాలతో కట్ చేసి బయటకు తీసుకెళ్తారు. అక్కడి నుంచి సులువుగా పట్టుకెళ్లేందుకు ముక్కలు, ముక్కలుగా చేసి ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్తారు. వెంటనే కేబుల్ తొలచి అందులోని రాగి సొత్తు కొనుగోలు చేసే స్క్రాప్ దుకాణం యజమానికి విక్రయిస్తున్నారు. ఇదంతా గంటల వ్యవధిలోనే జరిగిపోతోంది.

లోపాలు ఇవే..మూడేళ్ల క్రితం వరకు గనులపై సీఐఎస్ఎఫ్ సిబ్బంది కాపలా ఉండడంతో చాలా వరకు ప్రశాంతంగా ఉండేది. ప్రస్తుతం వారిని వెనక్కి పంపించడంతో ఎస్అండ్‌పీసీ, ప్రైవేట్ రక్షణ సిబ్బంది కాపలా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే దొంగలు రెచ్చిపోతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీ జరిగిన వెంటనే పోలీసులకు, అధికారులకు సమాచారం అందించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల పని సులువు అవుతుంది. ఒకవేళ చోరీ జరిగితే కిందిస్థాయి సిబ్బందిని బాధ్యుడిని చేస్తూ వేధింపులకు గురి చేస్తూ దొంగతనం విషయాన్ని బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.

స్క్రాప్ దుకాణాలపై నిఘా ఏది..

సింగరేణి సొత్తు దొంగిలించిన వెంటనే తమకు అనుకూలంగా ఉండే స్క్రాప్ దుకాణం యజమానికి విక్రయిస్తుంటారు. వచ్చిన డబ్బుతో దొంగలు జల్సాలు చేస్తూ డబ్బు అయిపోయిన తర్వాత తిరిగి చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసే వారిలో చాలా మంది 18-30 ఏళ్లలోపు వారు ఉంటారని సమాచారం. ఇటీవల మందమర్రిలో దొంగసొత్తు తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్అండ్‌పీసీ ఉద్యోగులు తనిఖీగా వెళ్లగా స్క్రాప్ దుకాణం యజమాని దాడికి యత్నించారు. కొందరు స్క్రాప్ దుకాణం యజమానులు ఇల్లు, వ్యాపారం నిర్వహించే చోట చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రక్షణ చట్రంలో ఉంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముందుగా వీరిని కట్టడి చేస్తే చోరీలను నియంత్రించవచ్చనేది నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# టెండరు పూర్తి.. స్థల గుర్తింపే అడ్డంకి



నేరడిగొండ: రాష్ట్రంలోనే ఎత్తయిన జలపాతం కుంటాల. రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి కూడా వేల సంఖ్యలో ఇక్కడికి పర్యాటకులు వస్తుంటారు. జలపాత సోయగాలు, ఇక్కడి ప్రకృతి రమణీయతకు మంత్రముగ్ధులవుతారు. కానీ పర్యాటకులకు ఇక్కడ సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. నిధులున్నా స్థల సమస్య కారణంగా పనులు ప్రారంభం కావడం లేదు. రెవెన్యూ, పర్యాటక శాఖాధికారులు కలిసి ముందడుగు వేస్తే గానీ సమస్య కొలిక్కి వచ్చేలా లేదు. కుంటాల జలపాతం వద్ద ఇబ్బందులను గుర్తించిన పర్యాటక శాఖ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు పంపారు. కేంద్ర ప్రభుత్వం 2020లో హరిత హోటల్ నిర్మాణం కోసం రూ.3.81 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పర్యాటకులు సేద తీరేందుకు అనువుగా గదులు, భోజనశాలలు, కాటేజ్‌లతోపాటు పచ్చదనం ఉట్టిపడేలా పార్కు, విశాలమైన రోడ్లు నిర్మించాలి. వాహనాలు నిలిపేందుకు స్థలం కేటాయించడంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి. టెండర్లు పూర్తయి 6 నెలలు గడిచినా స్థల గుర్తింపు సమస్యతో నిర్మాణ పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి.

మూత్రశాలలు లేక అవస్థలు..

సుదూర ప్రాంతాల నుంచి జలపాతం అందాలను వీక్షించేందుకు వచ్చే మహిళలు మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన అక్కడి సిబ్బంది గతంలో జలపాత సమీపంలో మరుగుదొడ్లు నిర్మించేందుకు ఎంపిక చేసి, పునాదిపై పాలిథీన్ కవర్లతో తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవీ తొలగించారు. వర్షం కురిస్తే పర్యాటకులు తడవాల్సిందే. జలపాతం వద్ద దుస్తులు మార్చుకునేందుకు స్థలం, గదులు లేక అవస్థలు పడుతున్నారు.

నిర్మాణం పూర్తయితేనే ఉపాధి..

జలపాతం సమీపంలో అనువైన స్థలం కేటాయిస్తే హోటల్ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కుంటాల గ్రామస్థులు అంతా సమావేశమయ్యారు. జలపాత సమీపంలో రూ.3 లక్షలతో, మూడెకరాల భూమిని కొనుగోలు చేశారు. భూమికి సంబంధించిన పత్రాలను అధికారులకు అందజేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో స్థల సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

స్థలం గుర్తించాకే పనులు ప్రారంభించాలి

సంతోష్‌రెడ్డి, తహసీల్దార్ నేరడిగొండ

కుంటాల గ్రామస్థులు హోటల్ నిర్మాణం కోసం చూపిన స్థలాన్ని పరిశీలిస్తాం. నిర్మాణం కోసం అవసరమైన స్థలం కోసం సంబంధిత శాఖల నుంచి దరఖాస్తు అందితే వెంటనే చర్యలు తీసుకుంటాం. మాకు దరఖాస్తు ఇచ్చిన శాఖకు స్థలం కేటాయించిన తరువాతే నిర్మాణ పనులు ప్రారంభించాలి.

రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించడమే ఆలస్యం

భీంరావు, ఐటీడీఏ ఈఈ

కుంటాల జలపాతం సమీపంలో హరిత హోటల్ నిర్మాణానికి రూ.3.81 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇటీవల టెండర్లు పూర్తయ్యాయి. గ్రామస్థులు హోటల్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి అనుమతి పత్రాలు అందజేయగానే వెంటనే హోటల్ తదితర అభివృద్ధి సంబంధిత నిర్మాణ పనులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

# ప్రారంభానికి ముందే పగుళ్లు

వైరా : నేలకొండపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఎక్సైజ్ ఠాణా గదులకు ప్రారంభానికి ముందే పగుళ్లు వచ్చాయి. ఇన్ని రోజులూ బయట గోడలకు మాత్రమే వచ్చిన నెర్రెల్ని సిమెంటు పూసి, రంగు వేసి గుత్తేదారు సరిచేశారు. కానీ లోపలకి వెళ్లి పరిశీలించగా భవనంలోని ప్రతి గోడకు నెర్రెలిచ్చాయి. గోడకు రెండు వైపులా ఒకేచోట పగుళ్లు రావటంతో పనుల్లో నాణ్యత నాసిరకంగా ఉందనేది స్పష్టంగా తెలుస్తోంది. మూడేళ్ల క్రితం పోలీస్ హౌజింగ్ బోర్డు ద్వారా రూ.లక్షలు వెచ్చించి నిధులతో దీన్ని నిర్మాణం చేపట్టారు. గుత్తేదారు అసంపూర్తిగా నిర్మాణాన్ని వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పైఅంతస్తులో కిటికీలు, దర్వాజలు వేయకుండా అలాగే ఉంచారు. ఇదేమని ప్రశ్నిస్తే ఒప్పందంలో అంతవరకే ఉందని బదులిచ్చారని సీఐ పోశెట్టి తెలిపారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కార్యాలయ భవనం పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



# గుణపాఠం నేర్చుకుంటారా? ఇదే ధోరణి అవలంబిస్తారా..?

వైరా : వైరా సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ వంతెన స్లాబు కూలడం చర్చనీయాంశమైంది. ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా అండర్‌పాస్ వంతెన పనులు చేస్తుండగా స్లాబు కూలిందన్న వార్తతో ఘటన స్థలాన్ని చూసేందుకు పలువురు ఆసక్తి కనబరిచారు. కూలిన స్లాబు, సిమెంటు కాంక్రీటు, ఇనుప జాలీలు, రాడ్‌వెండింగ్, ఐరన్ సెంట్రింగ్ సామగ్రిని సంబంధిత హైవే నిర్మాణ పనుల సిబ్బంది యంత్రాల సాయంతో శుక్రవారం ఉదయం నాటికి తొలగించి శుభ్రం చేశారు. స్లాబు కూలింది ఇక్కడేనా అన్నట్లుగా చక్కగా తీర్చిదిద్దారు. రూ.వేల కోట్లతో నిర్మించే జాతీయ రహదారి ప్రాజెక్టుపై కనీసం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు ఏడాదిన్నర కింద ప్రారంభమైన ఆయా పనులు ఖమ్మం గ్రామీణ మండలం తల్లంపాడు నుంచి వైరా మండలం సోమవరం వరకు ప్రత్యేక ప్యాకేజీ



కింద జరుగుతున్నాయి. కానీ ఇక్కడ పనిచేసేది ఎవరు? పర్యవేక్షించే అధికారులు ఎవరు? అనే సమాధానం మాత్రం దొరకదు. సోమవరం వద్ద డంపింగ్ పాయింట్, సిబ్బంది ఉండే వసతితోపాటు ఇతర సామగ్రి నిల్వచేసే పెద్ద కేంద్రాన్నే ఏర్పాటు చేశారు. తాజా అపశ్రుతితోనైనా హైవే నిర్మాణ పనులు దక్కించుకున్న బడా కాంట్రాక్టు సంస్థతో పాటు అధికార యంత్రాంగం గుణపాఠం నేర్చుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాంట్రాక్టులు, సబ్‌కాంట్రాక్టుల పరిస్థితిని సైతం బయటకు రానివ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తూ కనీసం సమాధానం ఇవ్వని ధోరణితో ఆయా పనులు చేపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు పట్టించుకుంటేనే మేలన్న భావన వ్యక్తమవుతోంది.

# భగీరథకు అవరోధాలెన్నో!

సంగారెడ్డి : ఇంటింటికీ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసింది. ఇందుకోసం భారీగా నిధులు ఖర్చు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసంపూర్తి పనులు పూర్తి చేయడంలో ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ట్యాంకులున్నా ఇళ్లకు పూర్తి స్థాయిలో కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడం, తరచూ పైపులకు లీకేజీలు ఏర్పడటం తదితర సమస్యలతో నిర్దేశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో కథనం.

మంజీరా నుంచి ఇళ్లకు..

పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట, మునిపల్లి మండలం బుస్సారెడ్డిపల్లి శివారులోని మంజీరా నది నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి.. జిల్లాలోని పట్టణాలు, పల్లెలకు సరఫరా చేస్తున్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా ప్రధాన పైపులైన్లు, అనుసంధాన పైపులైన్లు, ట్యాంకులు, సంపులు నిర్మించారు. ఈ పనులు కొన్ని చోట్ల అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

జిల్లాలో పథకం అమలిలా..

మొత్తం ఆవాస ప్రాంతాలు: 943

భగీరథ సరఫరా లేని గ్రామాలు: 26

ప్రాజెక్టు అంచనా విలువ: రూ.510.23 కోట్లు

ఖర్చు చేసింది: రూ.457.64 కోట్లు

నిర్మించిన ట్యాంకులు: 1658

కొత్తగా వేసిన పైపులైను: 3519.42 కిలోమీటర్లు

ఇంటింటా ఇచ్చిన కుళాయి కనెక్షన్లు: 2,79,919

క్షేత్రస్థాయి పరిస్థితి

పైపుల్లో సరిపడా ఒత్తిడి(ప్రెషర్) లేకపోవడంతో కల్హేర్ మండలం మహాదేవ్‌పల్లి, మాసాన్‌పల్లిలకు ఆరు నెలలుగా నీటి సరఫరా నిలిచిపోయింది. చెరువులో బోరు వేసి మాసాన్‌పల్లికి నీటిని సరఫరా చేస్తున్నారు.

పుల్కల్ మండలం కోడూరులో ట్యాంకు నిర్మించినా వినియోగించడం లేదు. గొంగ్లూరులో తరచూ పైపులకు లీకేజీలు ఏర్పడుతున్నాయి.

కంది మండలం చిద్రుప్పకు 15 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఇంద్రకరణ్‌లో అసంపూర్తి పనుల వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. కొండాపూర్ మండలం మన్‌సాన్‌పల్లి సంగారెడ్డి-వికారాబాద్ జిల్లాల సరిహద్దులో ఉంటుంది. ప్రత్యేక పైపులైను, సంపు నిర్మాణాల్లో



జాప్యం వల్ల ఆరు నెలలుగా నీటిని సరఫరా చేయడం లేదు.

ఝరాసంగం మండలం పేలవరం, దేవరంపల్లి, మేదపల్లి, కృష్ణాపూర్, బిడెకన్నెలకు పంచాయతీ ద్వారా అందిస్తున్న నీరు ప్రజలకు సరిపోవడం లేదు. వ్యవసాయ బావుల, బోర్ల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

సిద్దాపూర్ తండాలో ఇప్పటికీ మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వలేదు. స్థానిక బోరునీరే దిక్కు. జహీరాబాద్, మనూరు, నాగల్‌గిద్ద, కంగ్టి తదితర మండలాల్లోనూ నీటి సమస్య ఉంది.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం

-ఎస్‌కే పాషా, మిషన్ భగీరథ ఈఈ

మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలందరికీ తాగు నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని చోట్ల ఇంకా పనులు కొనసాగుతున్నాయి. పుల్కల్ మండలం కోడూరు, కల్హేర్, కంది, కొండాపూర్ మండలం మన్‌సాన్‌పల్లి, తదితర చోట్ల ఇబ్బందులను అధిగమిస్తాం. పైపులైన్ల లీకేజీలను ఎప్పటికప్పుడు అరికడుతున్నాం.




## కర్పూరీ ఠాకుర్ నిరాడంబరతను గుర్తుచేసుకున్న మోదీ

దిల్లీ: బిహార్ రాష్ట్రంలో 'జన నాయక్'గా ప్రసిద్ధి పొందిన మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత కర్పూరీ ఠాకుర్‌కు కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' ప్రకటించిన విషయం తెలిసిందే. నేడు ఆయన 100వ జయంతి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు నివాళులర్పించారు. ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ తన బ్లాగ్‌లో సుదీర్ఘ పోస్ట్ చేశారు. "సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడి కోట్లాది మంది ప్రజల జీవితాలను మార్చిన జననాయక్ కర్పూరీ ఠాకుర్ శత జయంతి నేడు. ఆయనను ప్రత్యక్షంగా కలిసే అవకాశం నాకు ఎన్నడూ రాలేదు. కానీ, ఆయన గురించి చాలా విన్నాను. అత్యంత వెనుకబడిన వర్గం నుంచి వచ్చిన ఆయన.. ఎన్నో అడ్డంకులను అధిగమించి సమాజ అభివృద్ధి కోసం పాటుపడ్డారు. ఠాకుర్‌జీ తన జీవితాంతం నిరాడంబరత, సామాజిక న్యాయం అనే రెండు స్తంభాలపైనే నిలబడ్డారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా తన కుమార్తె పెళ్లిని సొంత డబ్బులతో జరిపించారు" అని ప్రధాని తెలిపారు.

**చిరిగిన కుర్తాతో వస్తే..** ఈ సందర్భంగా కర్పూరీ ఠాకుర్ నిరాడంబరతను చాటిచెప్పే మరో సంఘటనను ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. "అది 1977లో జరిగిన సంఘటన. ఠాకుర్‌జీ అప్పుడే బిహార్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు దిల్లీ, పట్నాలో జనతా ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఆ సమయంలో లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ పుట్టినరోజును జనతా నేతలు ఘనంగా నిర్వహించారు. పెద్ద పెద్ద నాయకులు హాజరైన ఆ వేడుకలో సీఎం ఠాకుర్‌జీ చిరిగిన కుర్తాతో కన్పించారు. దీంతో అప్పటి జనతా పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌జీ మాట్లాడుతూ.. ఠాకుర్‌జీ కొత్త కుర్తా కొనుక్కొనేందుకు విరాళం ఇవ్వాలని తనదైన శైలిలో ప్రజలను అడిగారు. కానీ, ఠాకుర్‌జీ గురించి తెలుసు కదా..! విరాళాన్ని అందుకున్న ఆయన.. ఆ మొత్తాన్ని సీఎం సహాయ నిధికి ఇచ్చేశారు" అని ఆయన నిస్వార్థ సేవానిరతిని ప్రధాని కొనియాడారు. ఠాకుర్‌జీ చూపిన బాటలోనే తమ ప్రభుత్వం గత పదేళ్లుగా ప్రజలకు సేవ చేస్తోందని మోదీ అన్నారు. "ప్రజల కోసం ఆయన చేసిన సేవలకు కోటి కోటి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. దురదృష్టవశాత్తూ ఆయన సేవలు అవసరమైన సమయంలోనే.. మనం ఆయనను కోల్పోయాం. కానీ, ఆయన ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటారు. ఆయనే నిజమైన జననాయక్..!" అని మోదీ నివాళులర్పించారు.




## జగన్ సర్కార్‌కు షాక్.. వైఎస్ వివేకా హత్య కేసు నిందితుడు దస్తగిరికి బెయిల్

అమరావతి, జనవరి 24: ఏపీ హైకోర్టులో జగన్ ప్రభుత్వానికి గట్టి షాక్ తగిలింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉండి ఆపై అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరికి బెయిల్ మంజూరు అయ్యింది.

దస్తగిరికి ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. వివేకా హత్య కేసులో గత 85 రోజుల నుంచి కడప జైలులో షేక్ దస్తగిరి రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ మంజూరు చేయాలంటూ దస్తగిరి తరపున హైకోర్టులో న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. ఈరోజు (బుధవారం) హైకోర్టులో పిటిషన్ విచారణకు వచ్చింది. దస్తగిరి తరపున న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు.

కిడ్నాప్ కేసులో దస్తగిరిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నారని... ఎన్నికల దృష్ట్యా దస్తగిరిపై ఏపీ పోలీసులు పలు అక్రమ కేసులు నమోదు చేశారని కోర్టు ముందు వాదించారు.

## చంద్రబాబు బెయిల్‌ను సుప్రీంలో సవాల్ చేసిన ఏపీ ప్రభుత్వం

ఢిల్లీ: ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్‌ను సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం సవాల్ చేసింది. ఐఆర్ఆర్ కేసులో ఈ నెల 10న చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును ఏపీ ప్రభుత్వం సుప్రీంలో సవాలు చేసింది. చంద్రబాబు బయట ఉంటే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ నెల 29న ఈ కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కేసులో అక్రమాలు జరిగాయని ఏపీలోని జగన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ మేరకు గత ప్రభుత్వ హయాంలో స్కాం జరిగిందని సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబు పేరును కూడా చేర్చింది. అయితే అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు వేయాలని నిర్ణయించారే తప్ప రోడ్డు వేయలేదని, భూసేకరణ జరగలేదని, పైసా నిధులు కూడా ఇవ్వలేదని, అలాంటప్పుడు అధికార



దుర్వినియోగం, అవినీతి ఎలా జరుగుతుందని టీడీపీ ప్రశ్నిస్తోంది. రోడ్డు నిర్మాణం జరిగితే దాని వల్ల ఎవరైనా లబ్ధి పొందారేమోనని అనుకోవచ్చని, ఏదీ జరగకున్నా ఎవరికో లబ్ధి జరిగిందని ఊహించి కేసులు పెడతారా? అని టీడీపీ ప్రశ్నిస్తోంది.




న్యూయార్క్: స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటును ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యతిరేకించడాన్ని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ తప్పుబట్టారు. ఈ వైఖరి మారకపోతే.. ప్రపంచ శాంతికి సవాల్ విసురుతున్న ఇరు దేశాల వివాదం సుదీర్ఘకాలం కొనసాగే ప్రమాదం ఉందని తెలిపారు. చాలా చోట్ల తీవ్రవాద సంస్థలు పుట్టుకు రావొచ్చని హెచ్చరించారు. ఐరాస భద్రతా మండలి సమావేశంలో మంగళవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పాలస్తీనా ప్రజల స్వతంత్ర దేశ ఏర్పాటు హక్కును ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిందే. రెండు దేశాల ఏర్పాటు పరిష్కారాన్ని ఎవరు నిరాకరించినా ఆ నిర్ణయాన్ని తిరస్కరించాల్సిందే. ఎలాంటి స్వతంత్రం, హక్కులు, గౌరవం లేకుండా అంతమంది పాలస్తీనా ప్రజలు ఒక ప్రాంతంలో ఉండడం అసలు ఊహించలేం" అని గుటెరస్ అన్నారు. హమాస్- ఇజ్రాయెల్ ఘర్షణలు.. ప్రాంతీయంగా అల్లకల్లోలానికి దారితీస్తాయనే అంచనాలు నిజమవుతున్నాయని తెలిపారు. అందుకు ఇటీవల లెబనాన్, యెమెన్, సిరియా, ఇరాక్, పాకిస్థాన్‌లో జరిగిన దాడులను ఉదాహరణగా చూపారు. వెంటనే ఇరు పక్షాలు కాల్పుల విరమణ పాటించాలని సూచించారు. గుటెరస్ కాల్పుల విరమణ పిలుపును ఐరాసలోని ఇజ్రాయెల్ రాయబారి గిలద్ ఎర్డన్ తిరస్కరించారు. 2023 అక్టోబర్ 7న తమపై అత్యంత క్రూరంగా దాడి చేసిన హమాస్‌పై పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. ఏమాత్రం వెనక్కి తగ్గినా హమాస్ మిలిటెంట్లు మరింత రెచ్చిపోయి ఇజ్రాయెల్‌పై దాడులకు తెగబడతారని తెలిపారు. ఈ వివాదానికి మూలం ఇరాన్‌లోనే ఉందని ఆరోపించారు. హమాస్, హెజ్‌బొల్లా, హౌతీలకు ఆ దేశమే ఆయుధాలు సరఫరా చేస్తోందన్నారు. ఇప్పటి వరకు ఇజ్రాయెల్ దాడుల్లో 25 వేల మంది పాలస్తీనా పౌరులు మరణించారని గాజా ఆరోగ్య శాఖ మంత్రి వెల్లడించారు. దాదాపు 85 శాతం మంది ప్రజలు వలస వెళ్లారని తెలిపారు. మిగిలిన వారు తీవ్ర ఆకలితో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.




## లోక్‌సభ ఎన్నికలకు ఒంటరిగానే.. కాంగ్రెస్‌కు షాకిచ్చిన దీదీ

కోల్‌కతా: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. బెంగాల్‌లో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్‌తో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని తెలిపారు. ఫలితాల తర్వాతే పొత్తుపై తుది నిర్ణయం తీసుకుంటామని దీదీ వెల్లడించారు.

## 'నిజం గెలవాలి' యాత్ర.. తెదేపా కార్యకర్త కుటుంబాన్ని ఓదార్చిన నారా భువనేశ్వరి

జగ్గంపేట: తెదేపా అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొనసాగుతోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించిన వారి కుటుంబాల్ని ఆమె పరామర్శిస్తున్నారు. జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో తెదేపా కార్యకర్త పడాల వీరబాబు కుటుంబాన్ని భువనేశ్వరి ఓదార్చారు. కుటుంబసభ్యుల యోగక్షేమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థికసాయం కింద రూ.3లక్షల చెక్కును అందజేశారు.

నేడు తుని, కాకినాడ నియోజకవర్గాల్లోనూ ఆమె పర్యటించనున్నారు. గురువారం పి.గన్నవరం, అమలాపురం, రాజోలు, మండపేట.. శుక్రవారం అనపర్తి, నిడదవోలు, కొవ్వూరు, రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటన కొనసాగనుంది.



## భాజపాతో వైకాపాది కంటికి కనిపించని పొత్తు: వైఎస్ షర్మిల



విశాఖ: రాష్ట్రంలో కుమ్మక్కు రాజకీయాలు నడుస్తున్నాయని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. పాలకపక్షం, ప్రతిపక్షం భాజపాతో ములాఖత్ అయ్యాయని ఆరోపించారు. విశాఖలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. "భాజపాతో వైకాపా కంటికి కనిపించని పొత్తు పెట్టుకుంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక దానిపై పోరాటమే లేదు. విశాఖకు ఏం చేశారు? రైల్వే జోన్ కూడా ఇవ్వలేదు. గంగవరం పోర్టులో రాష్ట్ర వాటాను అప్పనంగా ఇచ్చేశారు. విశాఖ ఉక్కు కార్మాగారానికి తూట్లు పొడుస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్వీర్యం చేశాయి. ఇప్పుడున్న ప్రభుత్వం పోవాలి.. కాంగ్రెస్ రావాలి" అని పిలుపునిచ్చారు.

## మంత్రి పెద్దిరెడ్డిని అడ్డుకున్న వైకాపా కార్యకర్తలు

చిత్తూరు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. కుప్పం పర్యటన వెళ్తుండగా వి.కోటలో ఆయనను వైకాపా కార్యకర్తలు అడ్డుకున్నారు. పంచాయతీకి నీటి సరఫరా బిల్లులు చెల్లించలేదని అడ్డుపడ్డారు. నాలుగేళ్ల నుంచి బిల్లుల కోసం తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రూ.20 కోట్ల నీటి బిల్లులు చెల్లించాలని వైకాపా కార్యకర్తలు డిమాండ్ చేశారు.




## 'అన్న వదిలిన బాణం ఎవరికి మేలు చేద్దామని'.. షర్మిల, జగన్‌పై బీజేపీ విసుర్లు

న్యూఢిల్లీ, జనవరి 24: ఏపీ రాజకీయాల్లో జరుగుతున్న మార్పులు, నాయకులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. విభజన సమయంలో జగన్మోహన్ రెడ్డి పార్లమెంట్‌లో ఉన్నారని.. ఏ విధంగా నక్కి నక్కి దాక్కొని ప్లకార్డు పట్టుకున్నారని ప్రశ్నించారు. ఆరోజే అన్న విశ్వసనీయతను షర్మిల ప్రశ్నిస్తే బాగుండేదన్నారు. అధికారంలోకి ఎలాగో రాలేమని కాంగ్రెస్ మొదటి సంతకం ప్రత్యేక హోదా అంటున్నారని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ అయినప్పుడు షర్మిల రోడ్డుపై కూర్చొని ధర్నా చేశారని గుర్తుచేశారు. రాజశేఖర్ రెడ్డి చనిపోతే ఆయన మరణానికి సంబంధించి కాంగ్రెస్‌పై షర్మిల అనుమానం వ్యక్తం చేశారని అన్నారు. అన్న వదిలిన బాణం ఎవరికి మేలు చేద్దామని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. వైసీపీ పిల్ల కాంగ్రెస్ అని వ్యాఖ్యలు చేశారు. మణిపూర్‌లో గొడవలు జరిగితే దానిపై షర్మిల మాట్లాడుతున్నారని.. మరి నాలుగేళ్లుగా ఏపీలో దళితులపై దాడులు, అమరావతి మహిళలపై దాడులు జరిగితే షర్మిల ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. అన్నా చెల్లెలు ఇద్దరూ కూడా మోసం చేయడానికి నడుము కట్టారని విమర్శించారు. ప్రత్యేక హోదా డిమాండ్ చేసింది గతంలో బీజేపీనే అని చెప్పుకొచ్చారు. రఘురామ రాజన్ కమిటీ గతంలో బడ్జెట్ మౌలిక సదుపాయాలు ఎలా ఉండాలో మాత్రమే చెప్పిందన్నారు. వెనుకబడిన రాష్ట్రాలపై నివేదిక ఇవ్వాలని రాఘురామ రాజన్ కమిటీని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించిందన్నారు. స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ మాత్రమే నాడు ప్రకటన రూపంలో కాంగ్రెస్ చేసిందన్నారు. విభజన సరైన విధంగా చేయలేదని మోదీ గతంలోనే చెప్పారన్నారు. స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ అమలు చేయాలని గత ప్రభుత్వానికి కేంద్రం సహాయం కూడా అందించిందన్నారు. ప్రజలను జగన్ సెంటిమెంట్‌తో రెచ్చగొట్టి అధికారంలోకి



వచ్చారన్నారు. కేవలం రాజకీయం కోసం ప్రత్యేక హోదాను తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. ప్రధాన మంత్రిగా చంద్రబాబు, జగన్ వచ్చినా కూడా ప్రత్యేక హోదా ఇవ్వలేరని స్పష్టం చేశారు. విశాఖ - బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. 20కి పైగా ఎంపీలను ఇస్తే జగన్ ప్రత్యేక హోదా తెస్తా అన్నారని.. అమలు కానీ హామీలు ఇచ్చి జగన్ ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తాం...** పర్వత శ్రేణుల్లో ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేక హోదాతో సంబంధం లేకుండా కేంద్రం సహాయం అందిస్తుందన్నారు. పరిశ్రమలకు అనుకూలంగా రాష్టంలో వాతావరణం లేదన్నారు. ఏపీ అభివృద్ధి కోసం బీజేపీ బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తామని.. ప్రకాశం, రాయలసీమ జిల్లాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. రామాలయం ఏ విధంగా కట్టి దేశం మొత్తం రామరాజ్యం చేశామో... రానున్న రోజుల్లో ఏపీలో రామరాజ్యం తీసుకొస్తామన్నారు. ఏపీలో ఉద్యోగులకు జీతాలు కూడా రావడం లేదని.. అంగన్వాడీల ఉద్యమాన్ని ప్రభుత్వం అణిచివేసిందని లంకా దినకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రెడ్డి కాకపోవడమే నా దౌర్భాగ్యం.. వైఎస్సార్సీపీపై నటుడు పృథ్వీరాజ్ ఘాటు వ్యాఖ్యలు




ప్రకాశం, జనవరి 24: వైఎస్సార్సీకి రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీపై విమర్శల దాడి చేస్తున్న నటుడు పృథ్వీరాజ్ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బూతుల మినిస్టర్లు, బూతుల యూనివర్సిటీ కుప్పకూలిపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయంటూ సెటైర్లు వేశారు. వైసీపీ నుంచి ఎందుకు బయటకు వచ్చారనే ఆయన మీడియాకు తెలియజేశారు. అలాగే పెద్దిరెడ్డి, అంబటి రాంబాబుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. చివరకు వైసీపీకి మిగిలేది 17 స్థానాలే అంటూ పృథ్వీరాజ్ విమర్శలు గుప్పించారు. బుధవారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... లోకేష్ వద్ద రెడ్ డైరీ ఉందని... తన దగ్గర పీఆర్ డైరీ ఉందని పృథ్వీ తెలిపారు. దుర్మార్గులు, మోసగాళ్లు, ఎమ్మెల్యేలుగా పనికి రాని అనర్హులు, వారి చరిత్రను డైరీలో రాసినట్లు చెప్పారు. బ్రో సినిమాలో శ్యాంబాబు లాంటి క్యారెక్టర్లన్నీ ఎన్నికల ప్రచారంలో బయటకు తీస్తానన్నారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉన్న తొమ్మిదేళ్లు పార్టీ కోసం పని చేశానని, కోట్లు దండుకోలేదని, కబ్జాలు చేయలేదని స్పష్టం చేశారు. జగన్ మాట తప్పను మడమ తిప్పనని చెప్పి మడం తిప్పేశారన్నారు. రెడ్డి కాకపోవడమే తన దౌర్భాగ్యమని... వైసీపీలో రెడ్లకే పెద్దపీట అని వ్యాఖ్యలు చేశారు. కరోనా సమయంలో చావు బతుకుల్లో ఉన్నా ట్రీట్మెంట్‌కు బెడ్డు కూడా ఇవ్వలేదన్నారు. అందుకే వైసీపీలో నుండి బయటకు వచ్చినట్లు చెప్పారు.

## శ్రద్ధా థై థండర్ షోస్ వైరల్

పెద్ద హీరోల సరసన అవకాశాల్లేకపోయినా కానీ, శ్రద్ధా దాస్ తనకంటూ పరిశ్రమలో ఒక గుర్తింపు సంపాదించింది. యువహీరోలకు ఒక ఆప్షన్ గా కొనసాగిన శ్రద్ధా పోటీ ఎంత ఉన్నా కానీ, దానిని అధిగమించి దూసుకెళుతోంది. తెలుగు సహా పలు పరిశ్రమల్లో శ్రద్ధా నటించింది. పూర్తి నిడివి ఉన్న కథానాయికగా .. అలాగే గ్లామరస్ పాత్రలతో మెప్పించిన శ్రద్ధా కొన్నిసార్లు అగ్ర హీరోల చిత్రాల్లో ప్రత్యేక పాత్రలను పోషిస్తూ ఇప్పుడు బుల్లితెరకు వచ్చి, కామెడీ షోలలో న్యాయనిర్ణేత పాత్రను పోషిస్తూ చురుకుగా ఉంటుంది. మరోవైపు సామాజిక మాధ్యమాల్లోను శ్రద్ధా స్పీడ్ మీద ఉంది. శ్రద్ధా దాస్ తన స్టైలిష్ లుక్, పర్ఫెక్ట్ ఫిగర్‌ని మెయింటెయిన్ చేయడంలో ప్రత్యేకతను చాటుకుంటోందనడానికి తాజా ఫోటోషూట్ ఒక ఉ



దాహరణ. తాజాగా శ్రద్ధా పర్పుల్ టాప్ ధరించి నలుపు రంగు మినీ స్కర్ట్... స్టైలిష్ హై బూట్‌లతో కనిపించే ఆకర్షణీయమైన ఫోటోలను షేర్ చేసింది. అదనపు ఆభరణాల బరువు లేకుండా.. పింక్ లిప్‌స్టిక్ తో తన లుక్ ని స్పెషల్ గా మార్చింది శ్రద్ధా.

ఈ ఫోటోలకు సోషల్ మీడియాల్లో అద్భుత స్పందన దక్కింది. శ్రద్ధా సింపుల్ లుక్ లో థై థండర్ షోస్ తో మతులు చెడగొడుతోంది అంటూ కొందరు అభిమానులు కామెంట్లు చేసారు. బ్లాక్ బాటమ్ మిడీలో శ్రద్ధా థై ఎలివేషన్ యువతను రెచ్చగొడుతోంది. శ్రద్ధా దాస్ కెరీర్ కి గుంటూరోడు తరహాలో మరో మాస్ హిట్ అవసరం. కానీ అలాంటి అవకాశం ఇచ్చేందుకు తెలుగు దర్శకులు ఆసక్తిగా ఉన్నారా? అన్నది చూడాలి.

## రష్మిక రూలింగ్ ఆన్ బాలీవుడ్..!

కన్నడ పరిశ్రమ నుంచి వచ్చి తెలుగులో స్టార్ గా ఎదిగిన హీరోయిన్ రష్మిక మందన్న. తెలుగులో ఛలో సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రష్మిక తన కెరీర్ లో కూడా చెలరేగిపోతుంది. తన టాలెంట్ తో టాలీవుడ్ లో స్టార్ హీరోల సరసన నటించిన అమ్మడు చిన్నగా బాలీవుడ్ వైపు వెళ్లింది. సౌత్ నార్త్ అనే తేడా లేకుండా అక్కడ ఇక్కడ సినిమాలతో అలరిస్తుంది. అయితే బాలీవుడ్ లో ఎంట్రీ సినిమా నిరాశపరిచినా పుష్ప 1 తో హిందీలో కూడా క్రేజ్ తెచ్చుకుంది రష్మిక. ఇక లాస్ట్ ఇయర్ చివర్లో వచ్చిన యానిమల్ సినిమా రష్మిక క్రేజ్ అమాంతం పెంచేసింది. సందీప్ వంగ డైరెక్షన్ లో తెరకెక్కిన యానిమల్ సినిమాతో బాలీవుడ్ అంతా షాక్ అయ్యింది. రణ్ బీర్ కపూర్ ని ఇదివరకు ఎప్పుడు చూడని పాత్రలో ప్రాజెక్ట్ చేసిన సందీప్ వంగ రష్మికని కూడా తన పాత్రతో మెప్పించేలా చేశాడు. యానిమల్ సినిమాలో గీతాంజలి పాత్రలో ఆకట్టుకుంది రష్మిక. యానిమల్ హిట్



తో బాలీవుడ్ లో తన పేరు మారు మోగేలా చేసుకుంటున్న రష్మిక రాబోతున్న పుష్ప 2తో కూడా మరోసారి పాన్ ఇండియా హిట్ టార్గెట్ పెట్టుకుంది. పుష్ప లో శ్రీవల్లి పాత్రలో తన టాలెంట్ చూపించిన రష్మిక ఆ సినిమాతో కూడా బీ టౌన్ ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేసింది. సినిమాలో ఆమె పాత్రకు హిందీ ఆడియన్స్ బాగా కనెక్ట్ అయ్యారు. ఇక ఇప్పుడు పుష్ప 2లో కూడా శ్రీవల్లి అలరించనుంది. ఇదే కాకుండా గర్ల్ ఫ్రెండ్ అంటూ మరో సినిమా చేస్తుంది రష్మిక.

ప్రస్తుతం అమ్మడికి ఉన్న ఫాలోయింగ్ చూసి ఆ సినిమాను కూడా పాన్ ఇండియా రిలీజ్ చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. మొన్నటిదాకా కేవలం సౌత్ లోనే సత్తా చాటిన రష్మిక ఇప్పుడు బాలీవుడ్ లో కూడా తన రూలింగ్ చేయబోతుంది. పుష్ప 2 ఎలాగు భారీ హైప్ తో వస్తుంది. అది కూడా హిట్ పడితే రష్మికకు బాలీవుడ్ లో కూడా తిరుగు ఉండదని చెప్పొచ్చు. ఇచ్చిన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తున్న కథానాయికగా రష్మిక సూపర్ పాపులర్ అయ్యింది. ఎంపిక చేసిన పాత్రలకు 100కి 100 శాతం అమ్మడు తన అవుట్ పుట్ ఇస్తుంది. అందుకే రష్మికకు వరుస అవకాశాలు వస్తున్నాయి. యానిమల్ హిట్ అమ్మడికి మంచి బూస్టింగ్ ఇచ్చిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.




# 2024 లో కొత్త భామల జోరు!



కొత్త ఏడాదిలో చాలా మంది భామలు తెలుగు తెరపై తెరంగేట్రం చేస్తున్నారు. తొలి సినిమాతో అదృష్టాన్ని పరీక్షించుకుని కెరీర్ దేదీప్యమానంగా సాగిపోవాలని ఆశపడుతున్నారు. అందులో ఫేమస్ బ్యూటీలు ఎవరంటే...బాలీవుడ్ భామలు దీపికా పదుకొణే..జాన్వీ కపూర్..తృప్తి డిమ్రి లాంటి భామలతో పాటు మానుషీ చిల్లర్..భాగ్య శ్రీ భోర్సే లాంటి భామలున్నారు. పాన్ ఇండియా చిత్రం నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తోన్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ కల్కి 2898 లో దీపికా పదుకొణే నటిస్తోంది. అమ్మడికిదే తొలి సినిమా. మొదటి సినిమాలోనే ప్రభాస్ తో నటిస్తోంది. ఈ పెయిర్ తెరపై ఎంతో అందంగా కనిపిస్తుందని చెప్పొచ్చు. ప్రభాస్ ని అన్ని రకాలుగా మ్యాచ్ చేసే నటి దీపిక. అందుకే ఈ ఫెయిర్ కి ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడుతుంది. అలాగే దేవర సినిమాతో జాన్వీ కపూర్ ఎంట్రీ కూడా అంతే ఆసక్తికరంగా ఉంది. ఇందులో అమ్మడు యంగ్ టైగర్ కి జోడీగా నటించడంతో ఆకాంబోని తెరపై ఎప్పుడు చూస్తామా? అని అభిమానులంతా ఎదురు చూస్తున్నారు. పెద్ద ఎన్టీఆర్ -శ్రీదేవి కాంబినేషన్ ఎంత సక్సెస్ అయిందే చిన్న ఎన్టీఆర్ -జాన్వీ అంతే సక్సెస్ అవుతారని అంచనాలున్నాయి. ఈ రెండు సినిమాల తర్వాత దీపిక.. జాన్వీ లు ఇక్కడ కొనసాగుతారా? లేదా? అన్నది అంతే సస్పెన్స్ గానూ కనిపిస్తోంది. ఎందుకంటే బాలీవుడ్ లో వీళ్లిద్దరు బిజీ హీరోయిన్లు. ఇక ఆపరేషన్ వాలెంటైన్ సినిమాతో మానుషీ చిల్లర్ ఎంట్రీ ఇస్తుంది. అందగత్తెల పోటీలో అమ్మడికి అగ్ర తాంబూలం ఇవ్వడంతో మానుషీ కలవరింపు ఎక్కువగానే ఉంది మార్కెట్ లో. ఈసినిమాలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కి జోడీగా నటిస్తుంది. అలాగే రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమాతో మరో బాలీవుడ్ నటి భాగ్య శ్రీ బోర్సే కూడా లాంచ్ అవుతుంది. ఇప్పటికే అమ్మడు అందంతో టాలీవుడ్ ని ఫిదా చేసింది. దీంతో ఆ బ్యూటీ తెరపై ఇంకెంత అందంగా కనిస్తుంది? అన్న ఉత్సాహం అభిమానుల్లో అప్పుడే మొదలైపోయింది. ఇక యానమిల్ తో ఫేమస్ అయిపోయిన తృప్తి డిమ్రి గురించి చెప్పాల్సిన పనిలేదు. ఈ అమ్మడికి పాన్ ఇండియాలో ఫాలోయింగ్ ఉంది. మంచి అందగత్తె. అందుకే గౌతమ్ తిన్ననూరి తన సినిమాలో ఛాన్స్ ఇచ్చినట్లు వినిపిస్తుంది. విజయ్ దేవరకొండతో ఆయన ఓసినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో గెస్ట్ పాత్రకి తృప్తిని తీసుకున్నట్లు సమాచారం.

## దేశభక్తి నేపథ్యంలో 'రామ్'.. రిపబ్లిక్ డేకి రిలీజ్!




దేశభక్తిపై తెరకెక్కే సినిమాలకు ప్రేక్షకులు ఎప్పుడూ స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తూ ఉంటారు. మామూలుగా అయితే బాలీవుడ్ లో ఈ జానెర్ లో ఎక్కువగా సినిమాలు వస్తుంటాయి. ప్రతి ఏడాది బాలీవుడ్ మేకర్స్ కచ్చితంగా ఓ పేట్రియాటిక్ మూవీని రిలీజ్ చేస్తూ ఉంటారు. ఇక మన టాలీవుడ్ లో అయితే చాలా అరుదుగా వస్తుంటాయి. ఇక టాలీవుడ్ నుంచి అలాంటి ఓ దేశభక్తి చిత్రం ఈ రిపబ్లిక్ డే కి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆ సినిమా పేరే రామ్(RAM/ రాపిడ్ యాక్షన్ మిషన్)'.. దీపిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఓఎస్ఎం విజన్‌తో కలిసి ప్రొడక్షన్ నెం. 1గా ఈ సినిమాను రూపొందించారు. మిహిరామ్ వైనతేయ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. ఆయనే ఈ మూవీకి కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ కూడా అందించారు. దీపికాంజలి వడ్లమాని నిర్మాణంలో తెరకెక్కిన ఈ సినిమాతో సూర్య అయ్యలసోమయజుల హీరోగా పరిచయం కానున్నారు. ధన్యా బాలకృష్ణ హీరోయిన్‌గా నటించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన పోస్టర్లు, పాటలు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకోగా ఇటీవల రిలీజ్ అయిన ట్రైలర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. ఇక అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ సినిమాని రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేస్తే బాగుంటుందని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. క్రమంలోనే జనవరి 26న సినిమాను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ పోస్టర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు. పేట్రియాటిక్ కమర్షియల్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో రామచందర్ సాయికుమార్ రోహిత్ సుమలేఖ సుధాకర్ రవి వర్మ మీనా వాసు అమిత్ కుమార్ ది వారి భాష తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. సాయికుమార్, శుభలేఖ సుధాకర్ లాంటి ఎక్స్పీరియన్స్ ఉన్న సీనియర్ యాక్టర్స్ ఈ సినిమాలో నటించడం సినిమాకి మరింత ప్లస్ అని చెప్పాలి. ఆశ్రిత్ అయ్యంగార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ధరణ్ సుక్రే సినిమాటోగ్రఫర్ గా వ్యవహరిస్తున్నారు. టాలీవుడ్ లో చాలా గ్యాప్ తర్వాత పేట్రియాటిక్ జోనర్ లో వస్తున్న రామ్(RAM/ ర్యాపిడ్ యాక్షన్ మిషన్) ఎలాంటి సక్సెస్ ని అందుకుంటుందో చూడాలి.

## మృణాల్ మెరుపులు ఉరుములు

మృణాల్ ఠాకూర్ తెలుగు-హిందీ చిత్రాలలో నటిస్తూ పాపులర్ అయిన ప్రతిభావంతురాలు. ముజ్సే కుచ్ కెహ్తీ...యే ఖామోషియాన్ వంటి టెలివిజన్ సోప్ ఒపెరాలతో తన కెరీర్‌ను ప్రారంభించి, లవ్ సోనియాలో తన ప్రభావవంతమైన అరంగేట్రంతో పెద్ద తెరపైకి మారింది. సూపర్ 30 - బాట్లా హౌస్ వంటి జీవిత చరిత్ర చిత్రాలలో మృణాల్ ఠాకూర్ తన పాత్రల ద్వారా విస్తృతమైన గుర్తింపును పొందారు. కొన్ని పేలవమైన హిందీ చిత్రాలతో నిరాశ ఎదురైనా కానీ.. సీతా రామం - హాయ్ నాన్న వంటి తెలుగు రొమాంటిక్ డ్రామాలతో తిరిగి కెరీర్ లో ఉత్తమ విజయాలను సాధించింది. ఒక రకంగా తెలుగు సినీపరిశ్రమ మృణాల్ కి గొప్ప అవకాశాల్ని కల్పించడమే గాక అదృష్టాన్ని కూడా కట్టబెడుతోందని చెప్పాలి. ఇప్పటికే ఈ భామ ప్రతిభకు రెండు SIIMA అవార్డులు దక్కాయి. ఫెమినా ఇండియా ముఖచిత్రం కోసం ఇటీవలి ఫోటోషూట్‌లో మృణాల్ ఠాకూర్ తన అద్భుతమైన అందచందాలతో




కట్టి పడేసింది. బ్లాక్ బ్లేజర్‌లో మృణాల్ ఎంతో అందంగా కనిపిస్తోంది. మృణాల్ అందం ఆత్మవిశ్వాసం అభిమానులను ఆకర్షించింది. బ్లాక్ బ్లేజర్ తో కొన్ని ఫోటోల్లో బాస్ లేడీ వైబ్స్ ని క్రియేట్ చేసిన మృణాల్ .. మిరుమిట్లు గొలిపే చమ్కీల దుస్తుల్లో మెరుపులు మెరిపించింది. ముఖ్యంగా మృణాల్ బ్యాక్ లెస్ ఫోజులు మతులు చెడగొట్టాయి. యాక్షన్ - కట్ మధ్య టైమ్ అనే మ్యాజిక్ జరుగుతుంది.. #CoverGirl ఏఫెమీనా ఇండియా అంటూ మృణాల్ ఈ ఫోటోలను షేర్ చేసింది. సుర్భిశుక్లా మృణాల్ కి స్టైలింగ్ చేసారు. #MrunalThakur #FeminaJanuary2024 #FeminaCover #FeminaX MrunalThakur అంటూ ట్యాగుల్ని జోడించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. తదుపరి కెరీర్ మ్యాటర్ కి వస్తే.. విజయ్ దేవరకొండతో కలిసి తదుపరి తెలుగు చిత్రం ఫ్యామిలీ స్టార్‌లో నటిస్తోంది. బహుముఖ ప్రతిభ మనోహరమైన వ్యక్తిత్వంతో మృణాల్ ఠాకూర్ సినీప్రపంచంలో శాశ్వత ముద్రను వేస్తోంది.

## 34 నిమిషాల షాట్ సింగిల్ టేక్ లో!

ఆపిల్ బ్యూటీ హన్సిక కొంత కాలంగా సోలో ప్రయత్నాలు జోరుగా చేస్తోన్న సంగతి తెలిసిందే. అమ్మడు ఎక్కువగా లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనే ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. ఈ విషయంలో మాత్రం హన్సిక జయాపజయాలతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తోంది. దర్శక-నిర్మాతలు కేవలం ఆమెని మాత్రమే బేస్ చేసుకుని సినిమాలు తీస్తున్నారు. వచ్చిన అవకాశాల్ని అమ్మడు తెలివిగా సద్వినయోగం చేసుకుం టుంది. స్టార్ హీరోలతో ఆఫర్లు కూడా తగ్గిన నేపథ్యంలో ఈ రకమైన ప్రాజెక్ట్ లతో బిజీ బిజీగా గడుపుతోంది. తెలుగులోనూ వాటిని అనువాద రూపంలో రిలీజ్ అయ్యేలా చూసుకుంటుంది. ప్రస్తుతం అమ్మడు 105 మినిట్స్ అనే సినిమాలో



నటిస్తోంది. హన్సిక మెయిన్ లీడ్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది. రాజు దుస్సా అనే కొత్త కుర్రాడు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే ఈసినిమా ప్రచార చిత్రాలు కూడా రిలీజ్ అయ్యాయి. వాటితో సినిమాకి మంచి బజ్ క్రియేట్ అవుతుంది. ఇక ఈ సినిమా కోసం హన్సిక బాగానే కష్టపడినట్లు తెలుస్తోంది. 34 నిమిషాల ఒక షాట్ ని కేవలం సింగిల్ టేక్ లోనూ లాక్ చేసింది. అందుకోసం అమ్మడు ఏకంగా 8 రోజుల పాటు ప్రత్యేకంగా రిహార్సల్స్ చేసిందిట. సింగిల్ టేక్ లో షాట్ ఒకే అయిందంటే? దాని వెనుక తానెంత కష్టపడిందన్నది రివీల్ చేసింది. ఇలాంటి ప్రయోగాత్మక చిత్రం చేయడం నా కెరీర్ కి రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా కోసం చాలా కష్టపడాల్సి వచ్చింది. మంచి పాత్రలు వస్తే ఎంతకష్టమైనా పడొచ్చు. 34 నిమిషాల సన్నివేశం నాకెప్పుడు ఎదురవ్వలేదు. ఇది నాకు కొత్త రకమైన అనుభవాన్ని ఇచ్చింది. ఇలాంటి ప్రయో గాలు సినిమాలో మరెన్నో ఉంటాయి. సామ్ సిఎస్ సంగీతం సినిమాకి ప్రత్యేక పాత్రగా కనిపిస్తుంది అని తెలిపింది. ఈ సినిమాతో రాజు దుస్సా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇంతవరకూ ఎలాంటి అనుభవం లేకపోయినా హన్సిక కంటెంట్ నమ్మి అవకాశం ఇచ్చింది.




## సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిసింది అందుకేనట!

హైదరాబాద్: మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు మంగళవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి కలవడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేలు పార్టీ మారబోతున్నారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ ప్రచారాన్ని నలుగురు ఎమ్మెల్యేలు ఖండించారు. ప్రొటోకాల్ కోసం, తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసమే సీఎం రేవంత్‌ని కలిసినట్టు వివరణ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఉమ్మడిగా మీడియా సమావేశంలో వెల్లడించారు. తమ నాయకుడు కేసీఆర్ నాయకత్వంతో పూర్తి విశ్వాసంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా బీఆర్ఎస్ గడ్డ అని, ఆ నమ్మకంతోనే 10 స్థానాల్లో 7 చోట్ల బీఆర్ఎస్‌ను గెలిపించారని ఆమె అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని ఆమె అన్నారు. రాజకీయ దురుద్దేశంతో కొంతమంది ప్రచారం చేస్తున్నారని ఆమె ఖండించారు. "మా పార్టీ నాయకత్వానికి మా మీద ఎలాంటి అపనమ్మకం లేదు. కానీ గందరగోళం సృష్టించాలనే ప్రయత్నంతో ఈ ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానానికి నలుగురు ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వబోతున్నారని వార్తలు వస్తున్నాయి. అలాంటిదేమీ లేదు. ఎవరికీ వివరణ ఇవ్వడంలేదు. మాపై పార్టీకి నమ్మకం. మాకు కూడా పార్టీపై నమ్మకం, గౌరవం ఉన్నాయి" అని సునీతా లక్ష్మా రెడ్డి తెలిపారు. "ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నాను. ఎవరికీ వివరణ ఇవ్వడానికి రాలేదు. ప్రజల్లో ఒక గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే మా నాయకులు, కార్యకర్తలు ఎవరూ ఎలాంటి గందరగోళానికి గురికావొద్దు. దురుద్దేశంతో లేనిపోని మాటలు చెప్పున్నారు. అప్రతిష్ఠపాలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారు. సీఎం గారితో నిన్న ప్రొటోకాల్, మాకు ఎస్కార్ట్, పైలెటింగ్ ఇవ్వడంలేదని చెప్పాం. అదేవిధంగా కొన్ని అభివృద్ధి కార్యక్రమాల గురించి సీఎంతో మాట్లాడాం" అని సునీతా లక్ష్మారెడ్డి వివరించారు. కాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్) కొత్త ప్రభాకర్ రెడ్డి (దుబ్బాక) గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు) మాణిక్ రావు (జహీరాబాద్) మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎం నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌ను 100 మీటర్ల లోతున పాతిపెడతామని లండన్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడంబీ 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని, తామే చేర్చుకోవడానికి సిద్ధంగా లేమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించిన నేపథ్యంలో జరిగిన ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

వారు పార్టీ మారుతున్నారంటూ పార్టీ వర్గాల్లో ప్రచారం జోరుగా సాగిన విషయం తెలిసిందే.

## రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



కరీంనగర్: కరీంనగర్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఏక్‌నాథ్ షిండే రేవంత్‌రెడ్డినే అవ్వొచ్చని అ?న్నారు. తెలంగాణ ప్రజలు మైనార్టీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. బీజేపీ-కాంగ్రెస్ ఒప్పందంలోనే ఎమ్మెల్సీ ఎన్నికలకు వేర్వేరు నోటిఫికేషన్లు ఇచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ వైపు చూసే మైనార్టీలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. బీజేపీని ఓడించేది బీఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. ఆయన బుధవారం కరీంనగర్ పార్లమెంటరీ సోషల్ మీడియా వారియర్స్ మీటింగ్ పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు, చాలా చోట్ల బీఆర్ఎస్‌పై గెల్చిన ఎమ్మెల్యేలంతా కేవలం నాలుగైదుసార్లు ఓడిపోయిన సానుభూతితో మాత్రమే గెల్చారని అన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిలింది చాలా చిన్న దెబ్బ మాత్రమేనని, అయినా ప్రజలు 39 మంది ఎమ్మెల్యేలను గెలిపించారని గుర్తుచేశారు. చాలా స్వల్ప మెజార్టీతో 14 స్థానాలను కోల్పోయామని అన్నారు. కార్యకర్తలు ఢీలా పడిపోవాల్సిన అవసరం లేదని ధైర్యం చేప్పారు. గతంలో కరీంనగర్ పార్లమెంట్‌లో కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ఢిల్లీకి పంపిన చరిత్ర ఇక్కడి ఓటర్లదని తెలిపారు. తెలంగాణా ఉద్యమానికి ఊపిరులూదిన గడ్డ కరీంనగర్ అని చెప్పారు. 2009లో అల్గనూరులో అగ్గిపుట్టించి తెలంగాణ రావడానికి కారణమైందని చెప్పారు. రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద మాటలు చెప్పారని, కానీ, ఇవాళేంటి పరిస్థితి? అని ప్రశ్నించారు. కరెంట్ బిల్లులు కట్టొద్దని సోనియా కడుతుందని రేవంతే అన్నారు, బిల్లులు కట్టొద్దని మంత్రి వెంకట్ రెడ్డి అన్నరని గుర్తుచేశారు. దాన్నే తాను చెప్పుకొచ్చానని అన్నారు. వంద అబద్ధాలు చెప్పైనా ఒక్క పెళ్లి చేయాలంటారు.. అలా అబద్ధాలను నమ్ముకునే రేవంత్ సీఎం, కేంద్రంలో మోడీ ప్రధాని అయ్యారని ఎద్దేవా చేశారు. వాళ్లవన్నీ 420 హామీలని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవి చేసేందుకు అనుభవముందా అని అడిగితే రేవంతేమన్నాడు? అదేం ఉంది అన్నారు. ఇప్పుడు తెలుస్తోంది అనుభవం ఎంత అవసరమో? అని కేటీఆర్ మండిపడ్డారు. రైతుబంధు పేరు మార్చి రైతుభరోసా అని రేవంత్‌రెడ్డి దావోస్‌లో చెప్పారని విర్శించారు. మరి రైతుబంధు వచ్చిందా? అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రైతుబంధు పడలేదంటే మంత్రి ?కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పుతో కొడతానన్నాడు. మరి రైతుబంధు రాని రైతులు ఇప్పుడు ఆలోచించాలి. వారిని చెప్పుతోని కొట్టాలా? లేదా ఓటుతోని కొట్టాలా అనేది ఆలోచన చేయాలన్నారు.

## తెలంగాణ ఏపీ కర్ణాటక మూడు రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి




భద్రాద్రి కొత్తగూడెం: పామాయిల్ సాగు విస్తరణ కు కేంద్ర ప్రభుత్వ అనుచిత వైఖరి అడ్డంకిగా మారిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నేడు ఆయన దమ్మపేట మండలం అల్లిపల్లి పామాయిల్ తోటలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల పామాయిల్ రైతులు, అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. ఇంపోర్ట్ ట్యాక్స్ తగ్గింపు వల్ల ధరలు తగ్గి రైతులకు నష్టం కలుగుతోందన్నారు. ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ ఓఈఆర్ ఫార్ములా ప్రకారం రైతులకు ధరలు చెల్లించాలని తుమ్మల పేర్కొన్నారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటక మూడు రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఏపీ పామాయిల్ రైతులు తనను కలిశారన్నారు. ఏ రాష్ట్రంలో ఉన్నా పామాయిల్ రైతుల కోసం పోరాడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల కొత్త రైతులు పామాయిల్ సాగుకు ముందుకు రావడం లేదన్నారు. కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ ప్రకారం రైతులకు ధరలు చెల్లించాలని తుమ్మల పేర్కొన్నారు.

## సింగరేణి నియామకాల్లో అవకతవకలు.. రంగంలోకి ఏసీబీ..



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పీడ్ పెంచింది. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, పలు అక్రమాలపై ప్రభుత్వం సీరియస్ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే సింగరేణిలో జరిగిన పలు నియామకాల్లో అక్రమాలపై దృష్టి సారించింది. దీంతో, పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వివరాల ప్రకారం.. సింగరేణిలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ నియామకాల్లో అవకతవకలు జరిగినట్టు ఎండీ బలరాం తెలిపారు. ఈ క్రమంలో నియామకాల పేరుతో పలువురు ఉద్యోగులు డబ్బు వసూలు చేసినట్టు స్పష్టం చేశారు. దీంతో, ఇప్పటికే పలువురిని సింగరేణి యాజమాన్యం సస్పెండ్ చేసిందని చెప్పారు. ఇక తాజాగా, ఎండీ బలరాం సింగరేణి అంశంపై ఏసీబీకి లేఖ రాశారు. దీంతో, ఏసీబీ డీఎస్పీ రమేష్ నేతృత్వంలో విచారణ చేపట్టింది. సింగరేణిలో నియామకాలపై దర్యాప్తు చేస్తోంది.

## గోల్కొండ కోటకు అత్యాధునిక హంగులు.. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో లైట్ షో

చారిత్రక గోల్కొండ కోట అత్యాధునిక హంగులను సమకూర్చుకుంది. లైట్ షోకు సంబంధించి 30 ఏళ్ల నాటి సాంకేతిక పరిజానం స్థానంలో సరికొత్త సాంకేతి పరిజానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. పర్యాటకుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా, రాత్రి వేళ మరింత ఆకర్షణీయంగా కనిపించేలా, కోట చరిత్రను ఆకర్షణీయంగా వివరించేలా అత్యాధునికంగా సౌండ్ అండ్ లైట్ షోను కేంద్ర సర్కారు ఏర్పాటు చేయనుంది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి ఇవాళ రాత్రికి ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రారంభించనున్నారు. పర్యాటక శాఖ మాజీ మంత్రి చిరంజీవి, ఎంపీ విజయేంద్రప్రసాద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించే చారిత్రక కట్టడాల్లో గోల్కొండ కోట ముఖ్యమైనది.

ఇది ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంరక్షణలో ఉంది. 11వ శతాబ్దం నాటి ఈ గోల్కొండ కోటలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సౌండ్ అండ్ లైట్ షోను 1993లో ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల నాటి ఈ లైట్ షో స్థానంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన లైట్ షోను ఇప్పుడు ప్రవేశపెడుతున్నారు. గోల్కొండలో లైట్ షో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో 30 నిమిషాల 20 సెకన్ల పాటు ఉంటుంది. గోల్కొండ చరిత్రను చూపేందుకు 3డీ మ్యాపింగ్ ప్రొజెక్షన్, హై-రెజల్యూషన్ ప్రొజెక్టర్లు, లేజర్ లైట్లు, మూవింగ్ హెడ్స్ వంటి అధునాతన సాంకేతికతను దీనిలో ఉపయోగించారు.





## తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులుగా స్వీపర్, మొబైల్ టాయిలెట్ నిర్వాహకురాలు

హైదరాబాద్: 75వ గణతంత్ర దినోత్సవం కోసం యావత్ భారత్ సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో ఎర్రకోటపై మువ్వన్నెల జెండా రెపరెప లాడనుంది. ఈ సారి 1500 మంది రైతులు వేడుకలకు హాజరవుతారు. ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ వస్తున్నారు. ఎప్పటిలాగే శకటాల ప్రదర్శన, వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు మహిళలు రిపబ్లిక్ డే వేడుకలకు అటెండ్ అవుతారు. వారిలో ఒకరు స్వీపర్ నారాయణమ్మ కాగా మరొకరు మొబైల్ షీ టాయిలెట్ నిర్వాహకురాలు నాగలక్ష్మీ. వీరిద్దరిని రిపబ్లిక్ డే వేడుకల కోసం జీహెచ్ఎంసీ అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులుగా ఢిల్లీ పంపించారు.

**నారాయణమ్మ :** నారాయణమ్మ స్వస్థలం రంగారెడ్డి జిల్లా యాచారం. గత 22 ఏళ్లుగా గ్రేటర్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. బంజారాహిల్స్ కాలనీల్లో నిత్యం రోడ్లను ఊడుస్తుంటారు. సమయం దొరికితే చాలు భజన, భక్తి కార్యక్రమాలకు హాజరవుతారు. జానపద గీతం, రామాయణ, భారతాలను పాటలుగా పాడతారు. వేమన పద్యాల నుంచి సంస్కృత పద్యాలు చెబుతారు. నారాయణమ్మ గాత్రం విని ఎవరైనా ఫిదా కావాల్సిందే. అలాంటి నారాయణమ్మ ఈ సారి రిపబ్లిక్ డే వేడుకల్లో తెలంగాణ ప్రతినిధిగా హాజరవుతారు.

**నాగలక్ష్మీ :** సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన నాగలక్ష్మీ. ఈమె రెండు డిగ్రీలు చేశారు. గత ఐదేళ్ల నుంచి కోదాడలో మొబైల్ టాయిలెట్ నిర్వాహకురాలిగా సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు ఆటోకు బిగించిన టాయిలెట్‌ను ఊరంతా తిప్పుతారు. గుడి వద్ద, బస్టాండ్ దగ్గర, మార్కెట్ వద్ద మొబైల్ టాయిలెట్ ఉంచుతారు. మొబైల్ టాయిలెట్ వాడుకున్న వారి నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోరు. ఉచితంగా సేవ అందిస్తున్నారు.

**ఐదుగురు సర్పంచ్‌లకు ఆహ్వానం :** రిపబ్లిక్ డే వేడుకలకు ఐదుగురు మహిళా సర్పంచ్‌లకు కూడా ఆహానం వచ్చింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన ఐదుగురికి పిలుపు వచ్చింది. ఖమ్మం జిల్లాకు చెందిన పాపిశెట్టి శైలజ, ములుగుకు చెందిన ఎం అనితారాణి, నాగర్ కర్నూలుకు చెందిన పి సురేఖ, సంగారెడ్డికి చెందిన బక్క రమాదేవి, వికారాబాద్‌కు చెందిన కాంతి లక్ష్మి ఉన్నారు. వీరంతా తమ భర్తలతో కలిసి వేడుకలకు రావాలని ఆహ్వానించారు.

## హరీష్‌రావు ప్రోద్బలం లేకుండానే ఆ ఎమ్మెల్యేలు సీఎంను కలిశారా?




సిద్దిపేట : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలవడం ఇప్పుడు రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆ నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న వార్త సంచలనాన్ని రేపుతోంది. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు స్పందిస్తూ.. బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఖర్మ సిద్ధాంతం ఇప్పుడు బీఆర్ఎస్‌కు అనుభవంలోకి వస్తోందని.. ఎవరు చేసుకున్నది వారికే తిరిగి వస్తుందనడానికి ఆ నలుగురు ఎమ్మెల్యేలు సీఎంను కలవడమే నిదర్శనమన్నారు. భూమి గుండ్రంగా ఉంటదని.. మనమేం చేస్తే అదే తిరిగి వస్తుందంటే ఇదే అని చెప్పుకొచ్చారు.

మెజారిటీ ఉన్నా కూడా అప్పుడు బీఆర్ఎస్ చేసిన పని ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోందన్నారు. పార్టీలను చీల్చడానికి, ఎమ్మెల్యేలను చేర్చుకోవడానికి బీఆర్ఎస్‌కు ఏడేండ్లు పడితే... కాంగ్రెస్‌కు ఏడు నెలలు కూడా పట్టడం లేదన్నారు. హరీశ్‌రావు ప్రోద్బలం లేకుండా వీరు వెళ్తారా అని బీజేపీ నేత ప్రశ్నించారు.

**ఆ వార్తతోనే మెదక్ నేతలు అలర్ట్...** బీఆర్ఎస్‌లో బావ బామ్మర్దులకు పడటం లేదన్నారు. కవిత మెదక్ ఎంపీగా పోటీ చేస్తున్నట్లు వార్తలు రావడంతో జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు అలెర్ట్ అవుతున్నారన్నారు. హరీష్‌రావు ప్రోద్బలం లేకుండా వారంతా సీఎంను కలిసే అవకాశం లేదన్నారు. ప్రజలు తిరస్కరించిన తరువాత కూడా బీఆర్ఎస్ నేతల్లో మార్పు రావడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పెద్ద జీరో అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రోటోకాల్ అంటే ఏమిటో తమకు నిన్నటి వరకు గుర్తు లేదా అని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కనీసం అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ దుష్ట సంప్రదాయం తెచ్చింది బీఆర్ఎస్ అని విరుచుకుపడ్డారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అది మూసీ, బంగాళాఖాతంలో వేసినట్లే అని అన్నారు.

**బీఆర్ఎస్‌లో మళ్లీ అదే కొట్లాట...** 2009 లో కేసీఆర్ అధ్యక్ష పీఠం గుంజుకోవడానికి జరిగిన కొట్లాట మళ్ళీ ఇప్పుడు ఆ పార్టీలో జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ అధ్యాయం మొన్నటి ఎన్నికలతో ముగిసిందన్నారు. అధికారం కోల్పోయినా ఇంకా తాము అధికార పార్టీ అన్నట్లుగా వారు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటనడం కేటీఆర్ అవివేకానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అయితే ఇక ఎన్నికల అవసరం ఉంటుందా అని ప్రశ్నించారు. బీజేపీకి ఈసారి రాష్ట్రంలో 16 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు 12 సీట్లు అనడం భ్రమ అని.. 90 సీట్లతో అధికారంలో ఉన్నప్పుడే ఆ పార్టీకి సింగిల్ డిజిట్ వచ్చిందన్నారు. ఇప్పుడు ఆ పార్టీని గల్లీలో కాంగ్రెస్ రానియదని.. ఢిల్లీలో బీజేపీ రానియదని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## ఆర్ఆర్ఆర్ భూ సేకరణపై సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ





హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి లేఖ రాశారు. భారత్ మాల, రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణ ప్రక్రియ చేపట్టాలని ఆ లేఖలో కోరారు.

భారతమాల పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్మించే జాతీయ రహదారులకు భూ సేకరణ చేయాల్సి ఉంది. రీజనల్ రింగ్ రోడ్డు భూ సేకరణ కోసం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఎన్‌హెచ్ఏఐ)కి 50 శాతం నిధులు జమ చేయాలని కిషన్ రెడ్డి కోరారు. ఇవే అంశాలకు సంబంధించి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేఖ రాశామని వివరించారు. అప్పటి ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆ ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సూచించారు.

**వివాదం ఏంటంటే..? :** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు వెలుపల రెండు భాగాలుగా 347.84 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించాల్సి ఉంది. ఫస్ట్ ఫేజ్ కింద 158.64 కిలోమీటర్ల ఉత్తర భాగానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి హెూదా ప్రకటించింది. 70 శాతానికి పైగా భూ సేకరణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాలని గతంలో ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. రహదారి నిర్మాణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. యుటిలిటీస్ (రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో అడ్డంగా వచ్చే కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, టెలికం లైన్లను తొలగించడం) తరలింపు వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలి. రహదారి నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉన్నందున కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది. దీనిపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేఖ రాసింది. యుటిలిటీస్ తరలింపు వ్యయం భరించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి లేఖ పంపించింది. దీంతో భూ సేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో భూ సేకరణ అంశంపై కదలిక వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎంపీ బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. సర్పంచుల పెండింగ్ బిల్లుల విడుదలకు వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు కావస్తున్నా సర్పంచుల పెండింగ్ బిల్లులపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సర్పంచుల పెండింగ్ బిల్లులను అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సర్పంచుల సంఘం ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని బండి సంజయ్ కోరారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గ్రామాలకు కేటాయించిన నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిమళ్లించిందని బండి సంజయ్ ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పెండింగ్ బిల్లుల కారణంగా రాష్ట్రంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం చేసిన పనులను కూడా ప్రభుత్వ అధికారులు రికార్డు చేయకుండా సర్పంచులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి సర్పంచులు చేసిన పనులను వెంటనే రికార్డు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం సర్పంచులతో సహా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనం పెంచాలని కోరారు. మాజీ సర్పంచులు, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులకు పెన్షన్ మంజూరు చేయాలని బండి సంజయ్ ఆ లేఖలో పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com